
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

శుక్రవారం 31 జనవరి 2025

↓ వేణుగోపాల్ నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగునీరు (ఫైల్) ↓





నిన్న అలా.. నేడు ఇలా..

తాత్కాలిక డ్రైనేజీని ఏర్పాటు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సమస్యల పరిష్కారానికి శరవేగంగా..

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కార్యక్రమంతో కదిలిన యంత్రాంగం

ఇది కొత్తచెరువులోని వేణుగోపాల్‌నగర్‌లో దుస్థితి. నిన్నటి వరకు కాలువ లేక రోడ్డుపైనే మురుగునీరు నిలుస్తోందనీ, దీంతో తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కుళ్లాయప్ప, షాబీర్.. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆ మేరకు పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసరెడ్డి తాత్కాలిక డ్రైనేజీ కాలువను గురువారం సిబ్బందితో ఏర్పాటు చేయించారు. తద్వారా మురుగు నీరు నిల్వ ఉండకుండా చేశారు. సమస్య పరిష్కారంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



లే ఔట్ దారిని పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ బాలాంజనేయులు

రైతుకు పరిహారం అందేలా చూస్తాం

బాలాంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్

కొత్తచెరువు-పెనుకొండ రహదారి పక్కన 483వ సర్వే నంబరులో 2020లో 484 మంది పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఆ కాలనీకి రహదారి కోసం పీవీ నవీన్ కుమార్‌కు చెందిన 1.30 ఎకరాల భూమిని అప్పట్లో తీసుకున్నారు. ఆ సమయంలో అప్పటి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, అధికారులు పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారని నవీన్ కుమార్ తెలిపారు. ఐదేళ్లు అధికారులు, ఎమ్మెల్యే చుట్టూ తిరిగినా పరిహారం ఇప్పించలేదని వాపోయారు.



మాట్లాడుతున్న రైతు పీవీ నవీన్‌కుమార్ (ఫైల్)

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ కార్యక్రమంలో సమస్యను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి అక్కడే రెవెన్యూ అధికారులకు రహదారి కోసం భూమి ఇచ్చిన రైతుకు పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. దీంతో గురువారం డీటీ బాలాంజనేయులు, వీఆర్వో భార్గవసాయి, సర్వేయర్ శివప్రసాద్, వీఆర్ఏ శివ.. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, రైతుకు పరిహారం అందేలా చూస్తామని డీటీ తెలిపారు.



వ్యాపారులకు నోటీసులు అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

వ్యాపారులకు నోటీసులు

రోడ్డు మధ్యలో డివైడర్లపై తోపుడుబండ్లు ఇతరత్రా వ్యాపారులు నిర్వహిస్తుండటం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని మెడికల్ స్టోర్ సుబ్రహ్మణ్యం.. అధికారులకు విన్నవించారు. సమస్య పరిష్కారానికి చర్యలు మొదలయ్యాయి. పోలీసుల సహకారంతో పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి.. వ్యాపారులకు నోటీసులు అందజేశారు.

- కొత్తచెరువులో జెట్ స్పీడుతో పనులు
- వేణుగోపాల్ నగర్‌లో తాత్కాలిక డ్రైనేజీ ఏర్పాటు
- డివైడర్లపై వ్యాపారాలు చేస్తున్న వారికి నోటీసులు
- జగనన్న లేఔట్ దారి కోసం సేకరించిన భూమి పరిశీలన
- హర్షం వ్యక్తం చేసిన ప్రజలు

కొత్తచెరువు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఉన్న సమస్యలకు రోజుల్లో పరిష్కారం లభిస్తోంది. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఈనెల 28న మండల కేంద్రంలో నిర్వహించిన 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా..' కార్యక్రమంతో యంత్రాంగం కదిలింది. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, అధికారులు హాజరైన ఈ వేదికపై స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరవు పెట్టారు. అర్జీలు సమర్పించారు. ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ మేరకు అధికారులకు అక్కడే ఆదేశాలిచ్చారు. వెంటనే యంత్రాంగం కదిలింది. సమస్యల పరిష్కారానికి శరవేగంగా చర్యలు చేపడుతోంది.



కొత్తచెరువులోని బుక్కపట్నం రహదారిలో డివైడర్లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

రేపు హాకీ జట్ల ఎంపిక పోటీలు

ధర్మవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఫిబ్రవరి 1వ తేదీన జిల్లాస్థాయి జూనియర్, సీనియర్ మహిళల హాకీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సూర్యప్రకాశ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్స్ విభాగంలో పాల్గొనేవారు 2006, సీనియర్స్‌లో పోటీపడేవారు 1996 సంవత్సరాల్లో జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించి ఉండాలన్నారు. పోటీలకు హాజరయ్యేవారు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్ తీసుకు రావాలని ఆయన తెలిపారు.

పాలినేనివారిపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం

ఓబుళదేవరచెరువు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలినేనివారిపల్లిలో తాగునీటి సమస్యపై 'నీరున్నా.. తప్పని తిప్పలు..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' గురువారం ప్రచురించిన కథనంతో అధికారుల్లో చలనం వచ్చింది. తాగునీటి బోరు మోటారు మరమ్మతులకు లోనై, రెండు నెలలు దాటినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో గ్రామస్థులు కిలోమీటరు దూరంలోని పొలం నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, సర్పంచ్ శంకర్‌రెడ్డి మోటారుకు మరమ్మత్తులు చేయించారు. తాగునీటి సమస్యను పరిష్కరించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తాగునీటి బోరుకు మోటారు అమర్చుతున్న కార్యదర్శి, సిబ్బంది

శిబిరానికి

చలో.. చలో..

- పురంలో క్యాంపు రాజకీయం
- విహార యాత్రకు టీడీపీ కౌన్సిలర్లు
- వైసీపీ సభ్యులతో జిల్లా అధ్యక్షురాలి భేటీ
- బలం లేకున్నా.. వైసీపీ ఆరాటం
- వేడెక్కిన చైర్మన్ ఎన్నిక

7

నేడు ప్రైవేటు విద్యాసంస్థల

బంద్

6

8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ

ధర్మవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉషోదయ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో ఫిబ్రవరి 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి చెస్ టోర్నీ నిర్వహించనున్నట్లు పోటీల నిర్వాహక కార్యదర్శి జాకీర్ హుస్సేన్ గురువారం ప్రకటనలో తెలిపారు. టోర్నీకి సంబంధించిన కరపత్రాలను గురువారం ఎంఈఓ-2 గోపాల్‌నాయక్ చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. వివరాలకు 9912647370 నంబరులో సంప్రదించాలని కోరారు.



గంగరాజు..!

భగీరథ ప్రయత్నం..

ఉబికొచ్చిన జలం

ఓబుళదేవరచెరువు మండలంలోని పాలినేనివారిపల్లికి చెందిన గంగరాజుకు రెండెకరాల పొలం ఉంది. అందులో బోరు వేసి, ఆ నీటితో పంటలు పండించుకుందామనుకున్నాడు. తొలుత బోరు వేశాడు, నీరు పడలేదు. అలా ఏకంగా తొమ్మిది బోర్లు వేశాడు, నీటి చుక్క చిక్కలేదు. రూ.7 లక్షల వరకు వెచ్చించాడు. అయినా.. ప్రయత్నం ఆపలేదు. భగీరథుడిలా నీటి చెమ్మ కోసం వెతికాడు. గతేడాది పదో బోరు కూడా వేశాడు. నీరు సమృద్ధిగా పడింది. దీంతో హమ్మయ్య.. అనుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. ఎండాకాలం మొదలవుతోంది. ఈ సమయంలో బోర్లలో నీరు తగ్గే అవకాశం ఉంటుంది. విచిత్రమేమిటంటే.. గంగరాజు పొలంలోని బోరు బావి నుంచి భూగర్భ జలం పొంగుకొస్తోంది. మోటారు వేయకుండానే గురువారం బోరు నుంచి ఉబికొస్తున్న నీటిని చూసి రైతు గంగరాజు ఆశ్చర్యపోయాడు. తొమ్మిది బోర్లు వేసినా.. దొరకని పాతాళ గంగ.. ఇప్పుడు ఏకంగా ఉబికొస్తుండడాన్ని చూసి.. సంబరపడిపోతున్నాడు. బోరుతున్న పొంగుతున్న నీటిని చూడడానికి చుట్టుపక్కల రైతులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.

-ఓబుళదేవరచెరువు (ఆంధ్రజ్యోతి)



బోరు వద్ద రైతు గంగరాజు

7

తృటిలో తప్పించుకున్నాం..!

కుంభమేళా తొక్కిసలాటపై ఉమ్మడి జిల్లా భక్తులు



కూటమి పాలనలో.. వైసీపీ దందాలు!

పురంలో ఇతర ప్రాంతాల వారి ఆగడాలు

హిందూపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో పట్టణంలో భూదందాలు, సెటిల్‌మెంట్లు, దౌర్జన్యాలు విచ్చలవిడిగా సాగాయన్నది బహిరంగ రహస్యమే. అప్పట్లో కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల ముఠాలు వచ్చి భూ సెటిల్‌మెంట్లు, దందాలు సాగించేవి. వారికి అప్పట్లో అధికార వైసీపీ నాయకులు, కొంతమంది పోలీసులు సహకరించారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పని సజావుగా సాగించుకుని వెళ్లిపోయేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆ గ్యాంగ్‌లు కనిపించకుండా పోయాయి. మొదట్లో ఇటువైపు ఇతర ప్రాంతాలవారు రావడానికి కూడా జంకారు. రెండు నెలలుగా మళ్లీ ఇతర ప్రాంతాల గ్యాంగ్‌లు వచ్చి దందాలు సాగిస్తున్నాయి. భూదందాలకు తెరలేపాయి. దీంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు.

మందితో వచ్చి దౌర్జన్యాలు

సెటిల్‌మెంట్లతో చెలరేగిపోతున్న వైనం

నేరస్థులు, రౌడీషీటర్ల హల్‌చల్

హిందూపురంలో భూదందాలను రౌడీషీటర్లు, పాత నేరస్థులు వెనకుండి నడిపిస్తున్నట్లు సమాచారం. ధర్మవరం, కదిరి, కడపకు చెందినవారు గ్యాంగులుగా వచ్చి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో కలకలం రేపిన హత్య కేసులో నిందితుడుగా ఉన్న వ్యక్తి వైసీపీ నాయకుడితో కలిసి దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఓ పంచాయితీ విషయంలో సదరు నిందితుడు ఏకంగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి అవతలివైపు ఉన్న వ్యక్తులను బెదిరించినట్లు తెలిసింది. దీంతోపాటు పాత నేరస్థులు, రౌడీషీటర్లు కూడా భూపంచాయితీల్లో తలదూర్చుతున్నట్లు సమాచారం.

కూటమి వచ్చినా...

గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. కూటమి ఘన విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయినా నియోజకవర్గంలో వైసీపీ నాయకుల భూదందాలు ఆగట్లేదు. వైసీపీ హయాంలో దేవుని మాన్యాలు, ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జా చేశారు. ప్రస్తుతం కూడా ఆ పార్టీ నాయకులు నియోజకవర్గంలో భూదందాలకు తెరలేపుతున్నారు. వారికి కూటమికి చెందిన కొంతమంది నాయకులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

దౌర్జన్యాలపై కఠినంగా వ్యవహరిస్తాం: మహేష్, డీఎస్పీ



ఇతర ప్రాంతాలవారు జనాన్ని వెంటేసుకుని వచ్చి దౌర్జన్యం చేస్తానంటే కఠిన చర్యలు తప్పవు. అలాంటివారిపై కేసు నమోదుచేసి, రౌడీషీట్ కూడా ఓపెన్ చేస్తాం. సివిల్ పంచాయితీల్లో పోలీసులు జోక్యం చేసుకోరు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం చూస్తూ ఊరుకోం.

హిందూపురంలోని ఆర్టీసీ కాలనీలో మూడు నెలల క్రితం ఓ స్థలం విషయంలో సెటిల్‌మెంట్ చేసుకోవడానికి హిందూపురానికి చెందిన ఓ రియల్టర్ ధర్మవరం నుంచి గ్యాంగ్‌ను పిలిపించాడు. వారు వచ్చి ఇక్కడున్న కొంతమందిపై దౌర్జన్యం చేశారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో ఆ గ్యాంగ్ వెనక్కి తగ్గినట్లు తగ్గి పనికానిచ్చుకు వెళ్లిందని తెలుస్తోంది.

డీబీ కాలనీలో బోగస్ పత్రాలు సృష్టించి, తమ భూమిని హిందూపురానికి చెందిన వైసీపీ నాయకులు ఆక్రమించుకుని చదును చేసినట్లు బాధితులు వాపోయారు. ఆ స్థలం విలువ రూ.అర కోటి దాకా ఉంటుంది. పట్టణంలోని దండురోడ్డులో స్థానికులతోపాటు ఇతర జిల్లాకు చెందినవారి మధ్య భూవివాదం సాగుతోంది. ఇది కూడా పోలీసుల వద్దకు వెళ్లింది. వారు సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం.

ఇటీవలే బైపాస్ రోడ్డులో వైసీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్ వేయడానికి ప్రయత్నించారు. మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించి, పాతిన రాళ్లను తొలగించారు. ఇందులో వైసీపీ నాయకుల పాత్ర కీలకంగా ఉంది.

తాజాగా దండు రోడ్డులో పక్క జిల్లాకు చెందిన వైసీపీ నాయకుడు.. భూమిని కొనుగోలు చేశామని చదును చేయడానికి వచ్చాడు. ముద్దిరెడ్డిపల్లికి చెందినవారు అడ్డుకున్నారు. పక్కజిల్లాకు చెందినవారు సుమారు వందమంది వాహనాల్లో వచ్చారు. పోలీసులు ఆ వాహనాలను తనిఖీ చేసినా.. అంతమంది ఎందుకు వచ్చారని ప్రశ్నించకపోవడం గమనార్హం. కొసమెరుపేంటంటే వచ్చినవారు వాహనాలు దిగేయగా.. ఖాళీ వాటిని కొట్నూరు సమీపంలో పార్క్ చేశారు.

జడ్పీలో జగడం..!

ఎమ్మెల్యేలు, వైసీపీ జడ్పీటీసీల మధ్య గొడవ

గంటన్నరపాటు గరం... గరం..!

- సర్వసభ్య సమావేశంలో ఘర్షణ
- మూడుసార్లు టీడీపీ ఎమ్మెల్యేలు, వైసీపీ జడ్పీటీసీల వాగ్వాదం
- వాట్సాప్ పాలనపై ప్రభుత్వానికి టీడీపీ ఎమ్మెల్యేల ధన్యవాద తీర్మానం
- సూపర్ సిక్స్ అమలుపై వైసీపీ సభ్యుల విమర్శలు
- వైసీపీ దోపిడీ పాలనపై ఫైర్ అయిన మంత్రి, ఎమ్మెల్యేలు
- జడ్పీటీసీలకు నిధుల కేటాయింపుపై 40 నిమిషాలు గందరగోళం
- అధికార, విపక్ష సభ్యుల అరుపులతో దద్దరిల్లిన సభ



అనంతపురం విద్య, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో జగడం సాగింది. మూడున్నరేళ్లలో ఎన్నడూ లేనంత రచ్చ. గంటన్నరపాటు హైవోల్టేజ్ రగడ. అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వైసీపీ జడ్పీటీసీల మధ్య వాగ్వాదంతో జడ్పీ సర్వసభ్య సమావేశం దద్దరిల్లింది. సూపర్ సిక్స్ పథకాల అమలు, వైసీపీ పాలనలో అభివృద్ధిపై వైసీపీ జడ్పీటీసీలు, టీడీపీ ఎమ్మెల్యేల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో ఒకానొక స్థాయిలో కొట్టుకుంటారా అన్నట్టుగా ఘర్షణ పడ్డారు. మూడుసార్లు గొడవ పడ్డారు. తర్వాత చర్చ లేకుండా అర్ధంతరంగా సభను ముగించారు. స్థానిక జడ్పీ మీటింగ్ హాల్‌లో (మిగతా 7లో..)



జడ్పీలో గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యేలు, ఎంపీ, జడ్పీ చైర్‌పర్సన్



వాగ్వాదం చేసుకుంటున్న మంత్రి సవిత, జడ్పీ చైర్‌పర్సన్

రిజిస్ట్రేషన్ల కోసం అవస్థలు

పనిచేయని సర్వర్.. రిజిస్ట్రేషన్లు నిల్

రేపటి నుంచి పెరిగిన ధరలతో రిజిస్ట్రేషన్లు



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వేచిచూస్తున్న క్రయ, విక్రయదారులు

యాడికి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన క్రయ, విక్రయదారులతో గురువారం యాడికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కిక్కిరిసింది. ఫిబ్రవరి 1నుంచి పెంచిన మార్కెట్‌వాల్యూ ధరలతో రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇదివరకే స్థలాలు, భూముల కొనుగోలుకు అగ్రిమెంట్లు చేసుకున్న వారు రిజిస్ట్రేషన్ కోసం గురువారం యాడికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఎక్కువ సంఖ్యలో వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచిచూడడం కనిపించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచి సర్వర్ పనిచేయలేదు. ఈ కారణంగా గురువారం ఒక్క రిజిస్ట్రేషన్ కూడా కాలేదు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దనే క్రయ, విక్రయదారులు సాయంత్రం వరకు వేచిచూసి వెనుదిరగడం కనిపించింది. ఉదయం 10గంటల నుంచి రిజిస్ట్రేషన్ కోసం వేచిచూశామని, సర్వర్ పనిచేయడం లేదనే అధికారులు చెబుతున్నారని క్రయ, విక్రయదారులు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి మార్కెట్ వాల్యూధరలు పెరగనున్నాయని, రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా పెరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ చేయించుకుందామని వస్తే సర్వర్ పనిచేయని కారణంగా రిజిస్ట్రేషన్లు చేయలేమని అధికారులు చెప్పారని వారు వివరించారు. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ జాఫర్‌సాధిక్‌ను వివరణ కోరగా ఉదయం నుంచి సర్వర్‌పనిచేయని మాట వాస్తవమేనని, అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పరిస్థితి ఇలాగే ఉందన్నారు.

ధ్వంసమైన శాసనాల పరిశీలన



శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తు శాఖ అధికారులు

కుందుర్పి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ధ్వంసమైన పురావస్తు శాసనాలను గురువారం అధికారులు పరిశీలించారు. కుందుర్పిలోని ఆంజనేయ, వీరభద్ర, నరసింహస్వామి ఆలయాలకు వెళ్లే వెమార్గంలో ఉన్న పురాతన శాసనాలను కొందరు ధ్వంసం చేయగా ఉమ్మడి జిల్లా పురావస్తు శాఖ ప్రదర్శన శాల సహాయ సంచాలకులు డాక్టర్ రజిత ఇంపాక్ట్ సంస్థకు కన్వీనర్ శ్రీనివాసులు, చరిత్రకారుడు నరసింహులు, తహసీల్దార్ శ్రీనివాసులు వాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ శాసనాలను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ఫిబ్రవరి 6న రంగనాథస్వామి

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఆలయంలో లగ్నపత్రికను రాస్తున్న అర్చకులు

గుత్తి రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహోత్సవాలు ఫిబ్రవరి 6న నుంచి ప్రారంభమవుతాయని ఈఓ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆలయంలో అర్చకులు స్వామి వారి లగ్నపత్రికను రాశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లడుతూ ఫిబ్రవరి 12న స్వామి వారి కళ్యాణం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మురళీశర్మ, రవిస్వామి, రంగనాయకులు, ఆలయ మాజీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

నేడు ప్రైవేట్ విద్యాసంస్థల బంద్

ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

అనంతపురం విద్య, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలు బంద్ నిర్వహిస్తున్నట్లు ఐక్య విద్యార్థి సంఘాల నేతలు తెలిపారు. ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణ కాలేజ్‌లో ఇటీవల విద్యార్థి చరణ్ ఆత్మహత్య చేసుకున్నా కళాశాల యాజమాన్యంపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఆందోళన చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు. యాజమాన్యం క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో నాయకులు పరమేష్, పృథ్వీ, సురేష్ యాదవ్, చంద్రశేఖర్, చందు, గిరి, హేమంత్, సాయి, అజయ్, కార్తీక్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 13తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 10, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.



దేవదాయ మైదానంలో ఉన్న బస్టాండ్



బళ్లారి రోడ్డులో తాత్కాలిక బస్టాండు



మొలకాల్మూరు రోడ్డులో ఉన్న తాత్కాలిక బస్టాండ్

ఒక ఊరు.. నాలుగు బస్టాండ్లు..!

- నిత్యం ట్రాఫిక్ సమస్య
- నిర్మానుష్యంగా ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్
- రోడ్డు పక్కలోనే తాత్కాలిక బస్టాండ్లు

రాయదుర్గం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఒక ఊరికి ఒకే బస్టాండ్ ఉంటుంది. కానీ రాయదుర్గంలో మాత్రం నాలుగు బస్టాండ్లు ఉన్నాయి. పట్టణంలోని ప్రజలు ఏదైనా ఊరికి వెళ్లాలంటే ఆ మార్గంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న బస్టాండ్ వద్దకు వెళ్లాలి. దీంతో నిత్యం పట్టణంలో ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. 80 వేల మందికి పైగా జనాభా ఉన్న రాయదుర్గం పట్టణంలో అటు మొలకాల్మూరు రోడ్డులో బెంగుళూరుతో పాటు కర్ణాటక వైపు వెళ్లే బస్సులు, ఇటు బళ్లారిరోడ్డులో ప్రైవేటు, ఆర్టీసీ బస్సుల కోసం రోడ్డు పక్కనే తాత్కాలిక బస్టాండ్లు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణ నడిబొడ్డులో దేవదాయశాఖకు సంబంధించిన ఖాళీ స్థలంలో ప్రైవేటు, ఆర్టీసీ బస్టాండ్‌ను కొన్నేళ్ల నుంచి ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి అనంతపురంతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ప్రధానంగా ఏపీఎస్‌ఆర్టీసీ అధికారికంగా ఏర్పాటు చేసుకున్న బస్టాండ్ మాత్రం నిర్మానుష్యంగా ఉంటుంది. ఇక్కడి నుంచి బస్సుల రాకపోకలు ఏ మాత్రం ఉండవు. బస్టాండ్ నిర్మించి 15 ఏళ్లు అవుతున్నా బస్సులు మాత్రం అక్కడి నుంచి తిప్పడం లేదు. దీంతో పట్టణ ప్రజలకు కేంద్ర బిందువుగా ఉండే బస్టాండ్ ఏమాత్రం లేదు. నాలుగుచోట్ల బస్టాండ్లు ఉండడంతో నిత్యం సమస్యలు తలెత్తుతున్నాయి.

కేంద్రీకృత బస్టాండుతోనే పరిష్కారం

పట్టణ ప్రజలకు అనుకూలంగా ఉండేందుకు నాలుగు బస్టాండ్లను ఒకే చోట కేంద్రీకృతం చేయాల్సిన అవసరం ఉంది. పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో నాలుగు చోట్ల ఉన్న బస్టాండ్లను ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ వద్దకు కేంద్రీకృతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై అధికారులు చొరవచూపి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

దేవదాయ శాఖకు చెందిన మైదానంలో ఏర్పాటు చేసిన బస్టాండ్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉంది. పట్టణ నడిబొడ్డులో ఉండడంతో వాహన రాకపోకలు అధికంగా ఉంటాయి. దీనికి తోడు కూరగాయల మార్కెట్, ప్రభుత్వ వైద్యశాల, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, బాలికల కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. దీంతో జనసంచారం విపరీతంగా ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల దాకా విపరీతమైన రద్దీ ఉంటుంది. బస్సులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనాలు, భారీ వాహనాలు ఒకే సమయంలో రాకపోకలు చేస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో నాలుగు గంటల వ్యవధిలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయి శబ్ద, వాయుకాలుష్యం విపరీతంగా వెదజల్లుతోంది. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండడం లేదు. నాలుగు బస్టాండ్ల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బోసిపోయిన ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్

రోడ్డు పక్కనే బస్టాండ్లు

మొలకాల్మూరు వెళ్లే రహదారిలో రోడ్డు పక్కన ఒక బస్టాండ్ ఉండగా.. బళ్లారి వైపు వెళ్లే దారిలో ఇంకో బస్టాండ్ ఉంది. ఈ బస్టాండ్లకు మధ్యలో వినాయక సర్కిల్ ఉంది. రెండు వాహనాలు తిరిగే మార్గం కావడంతో ఒక వైపు ఒక్కసారిగా ఆర్టీసీ, ప్రైవేటు బస్సులతో పాటు కర్ణాటక బస్సులు కూడా రోడ్డులో నిలబడుతున్నాయి. వీటి నుంచి ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోతుంది. బస్సుల కోసం రోడ్ల మీదే తాత్కాలిక బస్టాండ్లు ఉండడంతో ఆ బస్సులన్నీ వినాయక సర్కిల్ వద్ద తిప్పుకుంటాయి. ఒక దాని వెనుక ఒకటి వెళ్లి తిప్పుకుంటుంటే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వాహనాలు ఢీ కొనడంతో సర్కిల్ మధ్యలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం ధ్వంసమయింది. చిన్నపాటి ప్రమాదాలు చాలా జరిగాయి. ఆటోల రాకపోకల వల్ల కూడా తాత్కాలిక బస్టాండ్ల వద్ద తీవ్ర అసౌకర్యంగా మారింది.

ప్రపంచ దృష్టిని జిల్లా వైపు తిప్పుతాం

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



డ్రిప్, స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న పయ్యావుల కేశవ్, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్

ఉరవకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లావైపు ప్రపంచ దృష్టిని తిప్పితామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. హార్టికల్చర్ హబ్‌గా జిల్లాను మారుస్తామన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఏపీఎంఐపీ (సూక్ష్మ సాగు నీటి పథకం) కింద 290 మంది రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లను పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్ కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో లక్ష ఎకరాల్లో సూక్ష్మ సాగునీటి పథకం లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఉమ్మడి జిల్లాలో 34వేల హెక్టార్లకు మాత్రమే డ్రిప్, స్ప్రింక్లర్లను ఇచ్చారన్నారు. ఆర్థిక విధ్వంసం జరిగిన రాష్ట్రంలో సంక్షేమపథకాలను అమలు చేయడం మాత్రం పక్కా అని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వివరించారు. కేంద్ర ప్రభుత్వం సహాయంతో పోలవరం, అమరావతి, రైల్వే ప్రాజెక్టులు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా రైతుల తలరాతలు మారాలంటే హంద్రీనీవాతోనే సాధ్యమన్నారు. పోలవరం నుంచి బనకచర్ల రెగ్యులేటర్‌కు నీళ్లను అనుసంధానం చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 80వేల హెక్టార్లకు డ్రిప్ పరికరాలను మంజూరు చేస్తే, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 40వేల హెక్టార్లకు మాత్రమే ఇచ్చారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. దావోస్ పర్యటన ద్వారా సీఎం రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకువచ్చేందుకు కృషి చేశారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37,500హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు లక్ష్యంగా ఉందన్నారు. ఇప్పటికే 10,313హెక్టార్లకు మంజూరు చేశామన్నారు. సూక్ష్మ సాగు నీటి పథకంలో దేశంలో జిల్లాను మూడవ స్థానంలో నిలిచేలా లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. వచ్చేనెల 5న హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లాకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీరఘునాథరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, ఏడీ ఫిరోజ్‌ఖాన్, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, విజయ్‌భాస్కర్, నూతేటి వెంకటేశులు, రామాంజినేయులు, మారెన్న, తిమ్మప్ప, ప్యారం కేశవానంద, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పాల్గొన్నారు.

హరిహరుల క్షేత్రం... అశ్వత్థం

- ఆదివారం నుంచి తిరుణాల
- ప్రతి ఏటా మఘమాసంలో ప్రారంభం
- తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తుల రాక
- తాడిపత్రి, అనంతపురం నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు



అశ్వత్థనారాయణస్వామి, శింగరభట్టు మహర్షి మూలవిరాట్



శ్రీచక్ర భీమలింగేశ్వరస్వామి

పెద్దపప్పూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామి, శ్రీ చక్ర స్థాపిత భీమలింగేశ్వరస్వామివారి తిరుణాల ఫిబ్రవరి 2 నుంచి ప్రారంభం కానుంది. ప్రతి ఏటా మాఘమాసంలో స్వామివారి తిరుణాలను వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారిని దర్శించుకోవడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. తాడిపత్రి నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రముఖ పుణ్యక్షేత్రం పెన్నా నది ఒడ్డున ఉంది.

స్థల పురాణం

పూర్వం కంచి నుంచి శింగరభట్టు అనే మునీశ్వరుడు శంఖం, చక్రం, గద, అభయహస్తంతో కూడిన శ్రీ విష్ణుమూర్తి దర్శనార్థం ఇక్కడకు వచ్చాడని స్థలపురాణం చెబుతోంది. ఆ మహారుషి వరదరాజులస్వామిని ప్రసన్నం చేసుకొనేందుకు 12సంవత్సరాలు స్వామివారికి సేవ చేశారు. ఇదే సమయంలో రావణ సంహారం అనంతరం శ్రీరామచంద్రుడు ఈ క్షేత్రానికి సమీపంలో ఉన్న పెద్దపప్పూరు రామకోటిలో నివసించేవాడని స్థలపురాణం చెబుతోంది. రావణుడు బ్రాహ్మణుడు కావడంతో బ్రాహ్మణ హత్యా పాతకమును భరించలేని శ్రీరాముడు అశ్వత్థ క్షేత్రంలో ఉన్న శింగరభట్టును కలిసి జరిగిన విషయాన్ని తెలిపారు. దీనికిగాను శింగరభట్టు మహర్షి నీ పాపమును నేను స్వీకరిస్తాను అని చెప్పాడు. తదనంతరం లక్ష్మీ సమేత విష్ణుమూర్తి ప్రసన్నం కోసం తపస్సు చేశాడు. మహారుషి శింగరభట్టుకు స్వప్నంలో స్వామివారు సాక్షాత్కరించారు. ఈ సందర్భంగా స్వామివారు ఇక్కడ స్నానం ఆచరించిన భక్తులకు బ్రాహ్మణహత్యాపాతకము ఉండదని, రావి, వేపచెట్టు చుట్టూ తిరిగి ప్రత్యేక పూజలు చేసిన వారికి కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పాడు. అనంతరం నదిలో విగ్రహ రూపంలో దర్శనమిస్తానని స్వామివారు శింగరభట్టుకు తెలియజేశారు. నీవు కూడా విగ్రహ రూపంలో నా పక్కనే కొలువు ఉంటావని, నీ తర్వాతే భక్తులు నన్ను దర్శించుకుంటారని చెప్పి అంతర్థానమయ్యారని పురాణం చెబుతోంది.

వేములవాడ భీమకవి ప్రతిష్ఠించిన భీమలింగేశ్వరుడు

శ్రీ అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలోనే స్వామివారికి అభిముఖంగా శ్రీ చక్రస్థాపిత భీమలింగేశ్వరున్ని వేములవాడ భీమకవి ప్రతిష్ఠించాడు. ముందుగా స్వామివారి లింగం కిందిభాగాన శ్రీ చక్రాన్ని జగద్గురు ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించారని ప్రతీతి. ఎక్కడాలేనివిధంగా శివుని దర్శనం కోసం వచ్చిన భక్తులకు విష్ణుమూర్తి దర్శనం కావడం, విష్ణుమూర్తి దర్శనం కోసం వచ్చిన భక్తులకు శివయ్య దర్శనం కావడం ఇక్కడ ఆలయ విశేషం. దీంతో ఆలయాన్ని హరిహరుల వెలసిన క్షేత్రంగా ప్రసిద్ధికెక్కింది.

ప్రతి ఏటా మాఘమాసంలో తిరుణాల

ప్రతి ఏటా ఫిబ్రవరిలో వచ్చే మాఘమాసంలో అశ్వత్థం తిరుణాల వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా అశ్వత్థ నారాయణస్వామి సన్నిధిలోని అశ్వత్థ కట్ట వద్ద వెలసిన నారాయణుడికి, శింగరభట్టు మహర్షికి, వినాయకుడికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. అనంతరం అభిముఖంగా వెలసిన భీమలింగేశ్వరున్ని భక్తులు దర్శించి మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఏడాది నాలుగువారాలపాటు తిరుణాల జరగనుంది. మూడో వారంలో భక్తులు వేలాదిగా తరలివస్తారు.

ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు..

ఎంతో ప్రసిద్ధిగాంచిన అశ్వత్థ క్షేత్రానికి రెండు తెలుగురాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. స్వామివారు కోరిన కోర్కెలు తీరుస్తారని ఇక్కడి నదిలో పుణ్యస్నాం చేసి స్వామివారిని దర్శించుకుంటే సకల పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఆలయానికి చేరుకోవడానికి తాడిపత్రి, అనంతపురం నుంచి ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. మహిళా భక్తులకు స్నానమాచరించేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటుచేశారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

చీనీకి పొలుసు పురుగు ముప్పు

ఉద్యాన శాఖాధికారి అమరేశ్వరి

తాడిమర్రి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చీనీ చెట్లకు పొలుసు పురుగు అధికంగా వ్యాప్తి చెందుతోందనీ, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి (హెచ్‌ఓ) అమరేశ్వరి సూచించారు. మండలంలోని శివంపల్లిలో గురువారం చీనీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ.. పొలుసు పురుగు ఉధృతి కారణంగా చీనీ చెట్లు చనిపోతున్నాయన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ పురుగు వ్యాప్తిని ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. 5 ఎం.ఎల్. షాంపూని లీటరు నీటికి కలిపి చెట్టు బాగా తడిసేలా పిచికారీ చేయాలన్నారు. ఆ తరువాత రోజు వేపనూనె, సిప్రోనిల్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఐదో రోజు స్పైరో టెట్రమాట్ 0.8 ఎం.ఎల్. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పొలుసు పురుగు వ్యాప్తి చెందకుండా చీనీ చెట్టు కాండానికి మైలుతుత్తి, సున్నం కలిపి పూత పూయాలన్నారు. వేసవిలో చీనీ చెట్లు చనిపోకుండా, వేరుకుళ్లు సోకకుండా వందలీటర్ల నీటికి కిలో యూరియా కలిపి పిచికారీ చేయాలని ఆమె వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమాదేవి, రైతు సేవా కేంద్రం అధికారులు గౌతమి, అజయ్, నిజాముద్దీన్, రైతులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు శాప్ చైర్మన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఫిబ్రవరి 1న జిల్లాకు రానున్నట్లు డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఫిబ్రవరి 2న ఉదయం క్రీడాశాఖ ఆధ్వర్యంలో చేపట్టే వీ-రన్‌లో ఆయన పాల్గొంటారు. అదే రోజు మధ్యాహ్నం ఆర్డీటీ స్టేడియంను సందర్శించి, 3న ఉదయం అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియాన్ని పరిశీలిస్తారు. అనంతరం క్రీడాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం తిరుపతికి వెళ్తారని డీఎస్‌డీఓ పేర్కొన్నారు.

ఎమ్మెస్సీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమ్మెస్సీ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు తెలిపారు. నవంబరు, డిసెంబరులో తృతీయ సెమిస్టర్(ఆర్21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అదేవిధంగా నాల్గవ సెమిస్టర్(ఆర్21) విద్యార్థులకు రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాలకోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మంత్రి కొల్లు పర్యటన వాయిదా

అనంతపురం అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా పర్యటన వాయిదా పడింది. శుక్రవారం అనంతపురం నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో నూతన మద్యం పాలసీలో భాగంగా నవోదయం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సి ఉంది. అనంతరం సోములదొడ్డి సమీపంలో ఐఎంఎల్ డిపోను ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే శుక్రవారం సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సమావేశం ఉండటంతో జిల్లా పర్యటనను రద్దు చేసుకున్నారు. తదుపరి పర్యటన తేదీని త్వరలోనే ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

ఆంధ్ర-14 జట్టులో ముగ్గురికి చోటు





ఎంపికైన రోహిత్, లిఖిత్, ఆదినారాయణరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-14 రాష్ట్ర బాలుర జట్టులో జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులకు చోటు దక్కింది. జిల్లాకు చెందిన రోహిత్, లిఖిత్, ఆదినారాయణరెడ్డి జట్టుకు ఎంపికయ్యారు.

తృటిలో తప్పించుకున్నాం..!



కుంభమేళాలో పామిడి పట్టణవాసులు



కుంభమేళాలో నాగ సాధువుతో పామిడివాసి జగదీష్ రావు (వృత్తంలో..)

రద్దీ ఎక్కువై తోసుకోవడమే ప్రమాదానికి కారణం

కుంభమేళా తొక్కిసలాటపై ఉమ్మడి జిల్లా భక్తులు

అనంతపురం కల్చరల్/పామిడి/పెనుకొండ టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు ఉమ్మడి జిల్లా నుంచి పలువురు భక్తులు వెళ్లారు. తొక్కిసలాట జరిగిన రోజున అదే ప్రాంతంలో ఉన్నా.. అందరూ క్షేమంగా బయటపడ్డారు. పామిడి నుంచి పలువురు భక్తులు వెళ్లారు. తొక్కిసలాట జరిగిన రోజే, అదే ప్రాంతంలో పుణ్యస్నానాలు చేశారు. కానీ మధ్యాహ్నం వెళ్లినందున తమకు ఆ విషయం తరువాత తెలిసిందని, ఆందోళనకు గురయ్యామని అన్నారు. 'మౌని అమావాస్య కావడంతో ఈనెల 29న కోట్లలో భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చారు. నదిలోని 3, 21, 22 సెక్టార్ల వద్ద తొక్కిసలాట జరిగింది. మేము 22వ సెక్టార్‌లోనే స్నానాలు చేశాము. తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకూ తొక్కిసలాట, గందరగోళం కొనసాగిందట. మేము మధ్యాహ్నం 1.40 గంటల ప్రాంతంలో స్నానాలు చేశాము. అప్పటికి మాకు తొక్కిసలాట గురించి తెలియదు. ఆ ప్రాంతం కాస్త ఖాళీగా కనిపించడంతో తేలికగానే స్నానాలు చేశాము. కానీ బయటకు వచ్చాక విషయం తెలిసింది. తొక్కిసలాట, మరణాల కారణంగా ఆ ప్రాంతం ఖాళీ అయ్యిందని అర్థమైంది. కాస్త భయం వేసింది..' అని పామిడికి చెందిన జగదీష్‌రావు అన్నారు. అక్కడ ఉష్ణోగ్రత కేవలం 8 డిగ్రీలు ఉందని, చలికి వణికిపోయామని అన్నారు. స్నానాలు ఎంతసేపైనా చేయవచ్చని, కాకపోతే చలి కారణంగా నీటిలో ఎక్కువ సేపు ఉండలేమని అన్నారు. అక్కడ సౌకర్యాలు బాగున్నాయని, తొక్కిసలాట మినహా మరువురాని అనుభూతి కలిగిందని జగదీష్‌రావు అన్నారు.

ఆటోలో వెళ్లాల్సిందే..



ప్రయాజ్‌రాజ్‌కు ఆదివారం చేరుకున్నాము. ఘాట్‌కు 20 కి.మీ. దూరంలోనే వాహనాలను నిలిపివేస్తున్నారు. రూ.200 చెల్లించి ఆటోలో వెళ్లాల్సి వస్తోంది. లక్షలాది మంది భక్తులకు ఘాట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కానీ విడిది కోసం వేసిన టెంట్లు సరిగా లేవు. కాశీ, అయోధ్యలోనూ ఇదే పరిస్థితి ఉంది. -యర్రజోడు రామాంజనేయులు, సోమందేపల్లి

బయటకు రాగానే..

తొక్కిసలాట నుంచి అనంతవాసులు రామకృష్ణ, చెరకు శ్రీనివాసులు, దామోదర్, రామలింగ, బాబు, భార్గవ నారాయణ తృటిలో తప్పించుకున్నారు. వీరు ఈనెల 28న అనంతపురం నుంచి రైలులో బయలుదేరి ప్రయాగ్‌రాజ్ చేరుకున్నారు. 2వ సెక్టార్‌లో నదీస్నానమాచరించి, 29వతేదీ రాత్రి 2 గంటల సమయంలో బయటకు వచ్చేశారు. రెండో సెక్టారు నుంచి తాము బయటకు వచ్చిన 15 నిమిషాల తర్వాత పక్కనే ఉన్న సెక్టార్‌లో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ కుంభమేళాకు చేరుకుని నదీస్నానమాచరించారు.



కుంభమేళాలో పాల్గొన్న అనంతపురం వాసులు

పటిష్టమైన ఏర్పాట్లు..



ప్రయాగ్‌రాజ్‌లో అక్కడి ప్రభుత్వం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. అయినా తొక్కిసలాట జరగడం బాధాకరం. ఆ ప్రమాదం నుంచి మేము కొన్ని నిమిషాల వ్యవధిలో తప్పించుకున్నాం. మేము బయటకు వచ్చేశాక తొక్కిసలాట జరిగింది. -రామకృష్ణ, అనంతపురం

ప్రజల తప్పిదమే..



కుంభమేళాలోని అన్ని సెక్టార్లలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. మౌని అమావాస్య కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఒకరినొకరు తోసుకోవడం వల్లే ప్రమాదం జరిగింది. తొక్కిసలాటకు ముందే ఘాట్ నుంచి బయటకు వచ్చేయడంతో మాకు ప్రమాదం తప్పింది. -చెరకు శ్రీనివాసులు

వెంటనే పంపుతున్నారు..



అరుణాచలేశ్వరుని దర్శనం తర్వాత ఈనెల 28న ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లాము. 17వ సెక్టారులో స్నానం చేశాము. భక్తులను ఎక్కువసేపు ఉండనివ్వడం లేదు. మూడు మునకలు వేయగానే పోలీసులు బయటకు పంపేస్తున్నారు. మేము ఘాట్ నుంచి బయటకు రావడానికి ఆరున్నర గంటల సమయం పట్టిందంటే రద్దీ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చును. మౌని అమావాస్య కారణంగా చాలామంది కుటుంబ సమేతంగా వచ్చేశారు. బారికేడ్లను తోసుకుంటూ రావడం వల్లే తొక్కిసలాట జరిగింది. రద్దీ సమయాల్లో కుటుంబాలతో రాకపోవడమే శ్రేయస్కరం. -విజయసాయి కుమార్

శిబిరానికి చలో.. చలో..



విహారయాత్రకు బయలుదేరిన టీడీపీ కౌన్సిలర్లు

- పురంలో క్యాంపు రాజకీయం
- విహార యాత్రకు టీడీపీ కౌన్సిలర్లు
- వైసీపీ సభ్యులతో జిల్లా అధ్యక్షురాలి భేటీ
- బలం లేకున్నా.. వైసీపీ ఆరాటం
- వేడెక్కిన చైర్మన్ ఎన్నిక

హిందూపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పురం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు సంబంధించి క్యాంపు రాజకీయం మొదలైంది. వచ్చేనెల 3న ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో రాజకీయం వేడెక్కింది. టీడీపీకి చెందిన మునిసిపల్ కౌన్సిలర్లు గురువారం విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. వైసీపీ కౌన్సిలర్లతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పురం ఇన్‌చార్జి సమావేశమయ్యారు. ఈ పరిస్థితుల్లో హిందూపురం మున్సిపల్ రాజకీయం రెండ్రోజులుగా వేడెక్కింది. పట్టణంలో ఎక్కడ చూసినా చైర్మన్ ఎన్నికపైనే చర్చ సాగుతోంది.

విహార యాత్రలో టీడీపీ కౌన్సిలర్లు

ఫిబ్రవరి 3న చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిలర్లు విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే బాలకృష్ణ సూచన మేరకు టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 18 మంది కౌన్సిలర్లు వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. కౌన్సిలర్లతోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, టీడీపీ నాయకుడు నాగరాజు వెళ్లారు. వీరు ఒకేసారి విహారయాత్ర నుంచి వచ్చేనెల 3న చైర్మన్ ఎన్నిక సమయానికి మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారు.

వైసీపీ కౌన్సిలర్లతో జిల్లా అధ్యక్షురాలి భేటీ

మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో గురువారం వైసీపీకి చెందిన కౌన్సిలర్లతో ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ సమావేశమయ్యారు. ఎన్నికరోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సభ్యులకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. వైసీపీకి చెందిన సభ్యులు సమావేశంలో కొన్ని అనుమానాలు వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. సమావేశానికి కొందరు డుమ్మా కొట్టినట్లు తెలిసింది. ఇలా అయితే ఎన్నిక రోజుకు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న ఆందోళన ఆ పార్టీ వర్గాల్లో నెలకొంది. చైర్మన్ ఎన్నికకు జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ, పురం సమన్వయకర్త దీపిక తర్జన భర్జన చేసినట్లు తెలిసింది. తాత్కాలిక చైర్మన్‌గా ఉన్న బలరాంరెడ్డి చైర్మన్‌గా ఉండాలని అధిష్టానం సూచించినట్లు జిల్లా అధ్యక్షురాలు.. ఆయనకు తెలిపింది. ఆయన సున్నితంగా తిరస్కరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఎందుకంటే రెండు నెలల క్రితం నాలుగో వార్డు నుంచి గెలుపొందిన వైసీపీ కౌన్సిలర్ లక్ష్మిని అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో ఆమె అప్పట్లో కొంత ఖర్చు కూడా భరించారు. ఈ నేపథ్యంలో తనకే అవకాశం ఇవ్వాలని ఆమె గట్టిగా అడిగినట్లు తెలిసింది. తాత్కాలిక చైర్మన్ బలరాంరెడ్డి, ముద్దిరెడ్డిపల్లికి చెందిన కౌన్సిలర్ జయప్ప, నాలుగోవార్డు సభ్యురాలు లక్ష్మి భర్త సమావేశమయ్యారు. ఈ సందర్భంలో చైర్మన్ అభ్యర్థి కోసం తర్జన భర్జన పడినట్లు తెలిసింది.

బలం లేకున్నా.. ఆరాటం

హిందూపురం మున్సిపాలిటీలో 38మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో మెజార్టీ సభ్యులు టీడీపీవైపు ఉన్నారు. బుధవారం విహారయాత్రకు వెళ్లినవారిలో 18మంది సభ్యులున్నారు. మరో ముగ్గురు సొంత పనులతో వెళ్లలేకపోయారు. దీంతో టీడీపీ బలం 21కి చేరింది. 23 నుంచి 24 మంది సభ్యులు కూటమివైపు ఉన్నారు. ఇక, వైసీపీ బలం 17మాత్రమే ఉంటుంది. చైర్మన్‌ను ఎన్నుకోవాలంటే 21మంది సభ్యుల మద్దతు అవసరం. 17మంది సభ్యులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. బలరాంరెడ్డి ఖర్చు భరించి, చైర్మన్‌గా ఉండాలని ఒక వర్గం ప్రోత్సహించింది. చైర్మన్ అయినా ఏడాదిపాటే సీటులో ఉంటారనీ, అంత ఖర్చు భరించి చేయగలిగింది ఏమీ ఉండదనీ, అంతేకాకుండా ప్రతిపక్ష పార్టీ తరఫున చైర్మన్‌గా ఉన్నా రోజూ అవమానపడాల్సిందే తప్ప.. అభివృద్ధి చేయడానికి ఆస్కారం ఉండదని భావించారు. దీంతో ఆయన చైర్మన్ పోటీకి ఉత్సాహం చూపలేదని సమాచారం. నాలుగో వార్డు సభ్యురాలు లక్ష్మిని పోటీలో నిలపాలని ముఖ్యనేతలు యోచిస్తున్నారు. ఒకవేళ ఖర్చు భరించినా చైర్‌పర్సన్ అవుతారన్న నమ్మకం ఆమెలో సన్నగిల్లింది. ఈ పరిస్థితుల్లో ఎవరు చైర్మన్ అవుతారో వేచిచూడాలి. అనూహ్య పరిణామాల మధ్య బలరాంరెడ్డినే బరిలో దించుతారని ఆ పార్టీ వర్గాలే చెప్పుకుంటున్నాయి. ఇది ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాలి.

జడ్పీలో జగడం..!

(5వ పేజీ తరువాయి)



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

జడ్పీ సర్వసభ్య సమావేశం గురువారం చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. మొదట వైద్యంపై చర్చ ప్రారంభించారు.

గంటపాటు సాఫీగా..

బుక్కరాయసముద్రం జడ్పీటీసీ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీకి సైతం కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బులు వసూలు చేస్తున్నారనీ, వైద్య శాఖాధికారులు కట్టడి చేయాలన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్స్ బిల్లులు ఇవ్వలేమంటూ కొన్ని ఆస్పత్రుల వద్ద బోర్డులు పెడుతున్నారనీ, ఇది సరికాదన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ... నేటికీ చాలా ఆస్పత్రుల్లో గత ప్రభుత్వ నేతల ఫొటోలు పెట్టారనీ, ప్రభుత్వం మారినా... తొలగించకుంటే ఎలాఅంటూ అధికారులపై అసహనం వ్యక్తంచేశారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ... కొందరు ఆర్ఎంపీలు.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనీ, వారిపై పర్యవేక్షణ కొరవడిందన్నారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి మాట్లాడుతూ.. 108 వాహనాలు ఎన్ని పని చేస్తున్నాయో.. లెక్కలు తియ్యండని వైద్యశాఖాధికారులను ప్రశ్నించారు. ఇంతలో ఎమ్మెల్యే రాజు కలుగజేసుకుని మడకశిర ప్రాంతో 5 ఉంటే... ఒకటి మాత్రమే పనిచేస్తోందనీ, ఫోన్లు చేస్తే ఎత్తరనీ, ప్రజల ప్రాణాలు పోయేలా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. తర్వాత అనంతపురం, లేపాక్షి, వజ్రకరూరు జడ్పీటీసీలతోపాటు, బెలుగుప్ప ఎంపీపీ తమ ప్రాంతంలోని వైద్య సమస్యలను సభ దృష్టికి తెచ్చారు.

వైసీపీ విమర్శలపై మంత్రి, ఎమ్మెల్యేల ఫైర్

సభలో మడకశిర ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కొత్తగా 'వాట్సాప్ పాలన' ద్వారా 161 సేవలు ప్రజలకు అందించేలా దేశంలోనే తొలిసారి తీసుకొచ్చిందనీ, ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ సభలో తీర్మానం చేయాలని కోరారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ బీకే పార్థసారధి ఆ తీర్మానాన్ని బలపరుస్తున్నామని ప్రకటించారు. ఇంతలో యల్లనూరు జడ్పీటీసీ బోగాతి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పథకాల అమలుపై ప్రభుత్వం మాట తప్పిందంటూ విమర్శలు గుప్పించారు. దీంతో ఒక్కసారిగా టీడీపీ ఎమ్మెల్యేలు పైకి లేచి ఫైర్ అయ్యారు. 'అభివృద్ధిపై మీరా మాట్లాడేది...సిగ్గు పడాలంటూ...' ఎమ్మెల్యే రాజు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒక్క జడ్పీటీసీ కూడా ఈ ఐదేళ్లలో తమ మండలాల్లో కిలోమీటరైనా రోడ్డు వేయించుకున్నారా అంటూ మండిపడ్డారు. ఎంపీ పార్థసారధి మాట్లాడుతూ... వైసీపీ పాలనపై ఇక్కడ అందరికీ తెలుసన్నారు. పంచాయతీలు, జడ్పీలను నిర్వీర్యం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సవిత మాట్లాతూ... జగన్ పాలనను దేశం మొత్తం చూసిందన్నారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తే.. కూటమి ప్రభుత్వం వాటిని చెల్లిస్తోందన్నారు. రూ.4 వేలు పింఛన్ ఇచ్చామనీ, ఇతర పథకాలు అమలుచేస్తున్నామన్నారు. వైసీపీ జడ్పీటీసీలు గొడవ చేయడం మానాలంటూ హెచ్చరించారు. ఈ క్రమంలో అరగంటపాటు అధికార పక్ష ఎమ్మెల్యేలు, వైసీపీ జడ్పీటీసీల మధ్య మాటల యుద్ధం సాగింది. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ.. వైసీపీ సభ్యులను రెచ్చగొడుతూ.. సభలోనూ తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఎమ్మెల్యేలు, మంత్రి ఫైర్ అయ్యారు. తర్వాత ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ... పార్టీలకు అతీతంగా చర్చలు సాగాలన్నారు. జగన్ గవర్నమెంట్ ఏం చేసిందో ప్రజలు తెలుసుకునే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. 'రాజకీయాలు మాట్లాడేందుకు ఇది వేదిక కాదనీ, తర్వాత ఓ రోజు పెట్టుకుందాం.. రండి' అంటూ సవాల్ విసిరారు. నిర్మాణాత్మకమైన సూచనలు ఇవ్వాలని జడ్పీటీసీలకు ఆయన సూచించారు. తర్వాత వ్యవసాయం, ఇరిగేషన్ తదితర అంశాలపై చర్చకు జడ్పీ చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు.

నిధులపై నిప్పులు

సభలో ఆత్మకూరు ఎంపీపీ, కదిరి జడ్పీటీసీలు తమకు కేటాయించిన పనులు చెయ్యనివ్వలేదంటూ మాట్లాడారు. దీంతో అగళి జడ్పీటీసీ ఉమేష్ మైక్ అందుకుని, ఈ ఐదేళ్లలో అగళి మండలాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేశారంటూ భగ్గుమన్నారు. ఇంతలో వైసీపీ జడ్పీటీసీలు 10 మంది వరకూ ఆయనపై మాటల దాడికి దిగారు. 'నువ్వు మాట్లాడకూడదు.. కూర్చో' అంటూ హెచ్చరించడంతో ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, రాజు ఒక్కసారిగా లేచి వచ్చి... వైసీపీ జడ్పీటీసీలను ఎదుర్కొన్నారు. 'మీరెవరయ్యా.. కూర్చోమనడానికి.. మీకేం హక్కుంది?' అంటూ హెచ్చరించారు. ఇంతలో జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్సీ మంగమ్మ, వైసీపీ జడ్పీటీసీలు అంతా ఒకవైపు... టీడీపీ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు మరో వైపుగా కదిలి... పోడియం వద్ద ఘర్షణకు దిగారు. 40 నిముషాల పాటు సభలో ఒకటే గందరగోళం. మరో వైపు వేదికపై మంత్రి సవిత, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ సైతం వాగ్వాదం చేసుకుంటూ కనిపించారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్, అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ మౌనం వహించారు. సభను సమన్వయం చేయడంలో జోక్యం చేసుకోలేకపోయారు. 40 నిముషాలపాటు సభలో రెండువర్గాల సభ్యుల మధ్య వాగ్యుద్ధం సాగింది. అన్నిశాఖల అధికారులు మౌనవీక్షకులుగా మారారు. మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కలుగజేసుకుని వైసీపీ అరాచకాలు సాగవన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీల్లో ఏమాత్రం అభివృద్ధి సాగింతో అందరికీ తెలుసన్నారు. రాజకీయాలు మాట్లాడకుండా కూటమి పాలనలో అభివృద్ధికి సహకరించాలని సూచించారు. తర్వాత పంచాయతీ రాజ్ ఇతర అంశాలపై అరకొరగానే చర్చలు సాగించి మధ్యలోనే ముగించారు. కార్యక్రమంలో సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఇతర అధికారులు, జడ్పీటీసీలు పాల్గొన్నారు.

8 నెలల్లో చాలానే చేశాం: సవిత, బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి

కూటమి పాలనలో ఎనిమిది నెలల్లో చాలానే చేశాం. వైసీపీ హయాంలో ఆగిపోయిన అమరావతిని పట్టాలెక్కించాం. పోలవరం పనులు కూడా మొదలుపెట్టాం. మాట ఇచ్చినట్లుగానే సీఎం చంద్రబాబు వృద్ధులకు పింఛన్ సొమ్ము రూ.4వేలు ఇస్తున్నాం. గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేస్తున్నాం. ఇవన్నీ చూసైనా... వైసీపీ సభ్యులు రాజకీయాలు మాట్లాడటం మాని, కూటమి పాలనకు సహకరించాలి.

పంచాయతీలను నాశనం చేశారు - బీకే పార్థసారధి, హిందూపురం ఎంపీ



వైసీపీ పాలనలో పంచాతీయలను నాశనం చేశారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జడ్పీలను నిర్వీర్యం చేశారు. 2019-2024 మధ్య వచ్చిన నిధులు మళ్లించారు. రాజకీయలే మాట్లాడాలనుకుంటే.. ఒక్కో అంశంతో రండి. మీ అభివృద్ధి ఏంటో చూపిస్తాం. అభివృద్ధి గురించి మాట్లాడండి. 15వ ఆర్థిక సంఘం, 8 పర్ క్యాపిటా బడ్జెట్, ఇతర నిధులపై కలెక్టర్ల సమక్షంలో సమీక్ష చేయండి. త్వరలో వేసవి వస్తోంది. జడ్పీ, డీపీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయం చేసుకుని, తాగునీటి సమస్య లేకుండా చూడండి.

అభివృద్ధి టీడీపీ విధానం... అడ్డుకునేది వైసీపీ సంస్కృతి.. - దగ్గుపాటి ప్రసాద్, అనంతపురం ఎమ్మెల్యే



అభివృద్ధి టీడీపీ విధానం.. పనులు అడ్డుకునేది గత వైసీపీ ప్రభుత్వ సంస్కృతి. గత ఐదేళ్లలో అభివృద్ధి ఏం జరిగిందో అందరికీ తెలుసు. కూటమి పాలనలో అభివృద్ధి వేగవంతమైంది. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 సేవలు సులభంగా అందనున్నాయి. రాజకీయం చేయడం మాని, అభివృద్ధి కోసం చర్చించండి. రుద్రంపేట పంచాయతీలో గత వైసీపీ పాలనలో రూ.36 లక్షల అవినీతి తేలింది. సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేశారు. ఆ డబ్బును వెంటనే రికవరీ చేయండి.

సర్పంచ్‌లకు మహర్దశ: కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే



గత వైసీపీ పాలనలో పంచాయతీల్లో ఏమాత్రం అభివృద్ధి చేశారో మీకే తెలుసు. అర్ధరాత్రి పూట పంచాయతీల ఖాతాలను సైతం ఖాళీ చేశారు. కూటమి ప్రభుత్వంలో సర్పంచ్‌లకు మహర్దశ పట్టింది. మంచి రోజులొచ్చాయని వైసీపీ సర్పంచ్‌లు మా వద్దకొచ్చి చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు చెప్పాలి.

వైసీపీ సభ్యులు సిగ్గుపడాలి: ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే, మడకశిర



గత ఐదేళ్లలో జిల్లా నీటిని పుంగనూరుకు తరలించారు. పంచాయతీలకు నిధుల్లేవు. జడ్పీటీసీలు కనీసం కిలోమీటరు కూడా రోడ్డు వేయించుకోలేదు. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలను విమర్శించడం సిగ్గుచేటు. అభివృద్ధిపై మాట్లాడే అర్హత వైసీపీ సభ్యులకు లేదు. చేతకాని సభ్యులు, జడ్పీ చైర్‌పర్సన్ సభను గొడవలు చేస్తూ... తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆఖరికి మైక్‌లు కూడా పనిచేయకుండా చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యం.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు కార్పొరేషన్ల కింద సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాకు రూ.42.86 కోట్లతో 2004 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లాలో స్థిరనివాసం కలిగిన బీసీలు, ఏబీసీడీఈ కేటగిరీలు, ఈబీసీ కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ, బలిజ, తెలగ, ఒంటరి వర్గాలవారు ఫిబ్రవరి 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పథకాలకు సంబంధించి 21నుంచి 60 ఏళ్లలోపు వయసు కలిగి, కుల, వయసు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతాతో ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మండల, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు

సెస్సు వసూళ్లలో కర్నూలు టాప్

- సీమలోని 74 మార్కెట్ కమిటీలకు రూ. 133.16 కోట్ల సెస్సు వసూలు లక్ష్యం
- జేడీ రామాంజనేయులు



మాట్లాడుతున్న జేడీ

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మార్కెట్ సెస్సు వసూలు రాయలసీమలో మొదటి స్థానంలో ఉందని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులోని ఏడీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో మార్కెట్ ఫీజు వసూళ్లపై వివరాలు వెల్లడించారు. కర్నూలు జిల్లాలో రూ.35.14 కోట్ల సెస్సు లక్ష్యానికి గాను ఇప్పటికే రూ.26.18 కోట్ల సెస్సు వసూలైందని అన్నారు. రెండో స్థానంలో నంద్యాల జిల్లా ఉందని, ఈ జిల్లాలో రూ.25.05 కోట్ల లక్ష్యానికి గాను రూ.15.42కోట్లు వసూలైందని జేడీ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్, రబీ సీజన్లలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటం వల్ల పంటల దిగుబడి బాగా ఉందని, కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరలు అందుతున్నాయని అన్నారు. అందువల్ల మార్కెటింగ్ ఫీజు కూడా లక్ష్యానికి మించి వసూలవుతున్నదని అన్నారు. అనంతపురం జిల్లాలో రూ.12 కోట్ల సెస్సు వసూలుకు గాను రూ.7.75 కోట్లు ఇప్పటికి వసూలైందని అన్నారు. చిత్తూరు జిల్లాలో రూ.10.49 కోట్లకుగాను రూ.5.83 కోటు, కడప జిల్లాలో రూ.12.50 కోట్లకుగాను రూ.7.8 కోటు, తిరుపతి జిల్లాలో రూ.23.24 కోట్లకుగాను రూ.12.41 కోట్లు, అన్నమయ్య జిల్లాలో రూ.8.37 కోట్లకు గాను రూ.7.15 కోట్లు వసూలయ్యాయని అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.5.31 కోట్ల లక్ష్యానికి గాను రూ.3.59 కోట్ల మేర సెస్సు వసూలైందని అన్నారు. రాయలసీమలోని 74 మార్కెట్ కమిటీల నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.133.16 కోట్ల సెస్సును వసూలు చేయాలనే లక్ష్యంగా నిర్ణయించామని, డిసెంబరు నెలాఖరుకు రూ.87.20 కోట్లు వసూలైందని అన్నారు. ఈ సంవత్సరం మార్కెట్ ఫీజు లక్ష్యాన్ని అధిగమిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. పంట ఉత్పత్తుల కొనుగోలు చేస్తున్న వ్యాపారుల నుంచి సక్రమంగా మార్కెట్ ఫీజు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీల సెక్రటరీలను ఆదేశించామని అన్నారు. చెక్‌పోస్టుల ద్వారా జీరో వ్యాపారాన్ని అరికట్టి పూర్తి స్థాయిలో సెస్సును వసూలు చేయాల్సిందిగా మార్కెట్ కమిటీల సెక్రటరీలకు ఆదేశాలిచ్చామన్నారు. త్వరలోనే కోడుమూరు మార్కెట్ కమిటీ యార్డును ప్రారంభిస్తామని అన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో కేంద్రం నిధులతో కోల్డ్ స్టోరేజీ ప్లాంటును నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు.

న్యూస్ బాక్స్

చీనీకి పొలుసు పురుగు ముప్పు

తాడిమర్రి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో చీనీ చెట్లకు పొలుసు పురుగు అధికంగా వ్యాప్తి చెందుతోందనీ, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన అధికారి (హెచ్‌ఓ) అమరేశ్వరి సూచించారు. మండలంలోని శివంపల్లిలో గురువారం చీనీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ.. పొలుసు పురుగు ఉధృతి కారణంగా చీనీ చెట్లు చనిపోతున్నాయన్నారు. రైతులు అప్రమత్తంగా ఉంటూ పురుగు వ్యాప్తిని ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. 5 ఎం.ఎల్. షాంపూని లీటరు నీటికి కలిపి చెట్టు బాగా తడిసేలా పిచికారీ చేయాలన్నారు. ఆ తరువాత రోజు వేపనూనె, సిప్రోనిల్ 2 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఐదో రోజు స్పైరో టెట్రమాట్ 0.8 ఎం.ఎల్. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పొలుసు పురుగు వ్యాప్తి చెందకుండా చీనీ చెట్లు కాండానికి మైలుతుత్తి, సున్నం కలిపి పూత పూయాలన్నారు. వేసవిలో చీనీ చెట్లు చనిపోకుండా, వేరుకుళ్లు సోకకుండా వందలీటర్ల నీటికి కిలో యూరియా కలిపి పిచికారీ చేయాలని ఆమె వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమాదేవి, రైతు సేవాకేంద్రం అధికారులు గౌతమి, అజయ్, నిజాముద్దీన్, రైతులు పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : జాతి పిత, మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ధర్మవరంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, ముదిగుబ్బలో టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, బుక్కపట్నం ఉన్నత పాఠశాలలో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు విద్యాసంస్థల బంద్

ధర్మవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నారాయణ విద్యాసంస్థ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని, ఆ విద్యాసంస్థను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల బంద్ చేస్తున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తెలిపారు. గురువారం వారు స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ.. అనంతపురంలో నారాయణ విద్యాసంస్థలో ఫీజుల వేధింపుల కారణంగా ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి ఆత్మహత్య చేసుకుంటే.. ఆ కళాశాల యాజమాన్యంపై ఇంతవరకూ కేసులు నమోదు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతలయ్య, జగదీశ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, వైఎస్‌ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, ఏఐఎస్‌బీ నాయకులు తరుణ్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వంశీ, విక్కీ పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయండి: ఆర్డీ

ధర్మవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇంటి, ఆస్తి పన్నులను సకాలంలో వసూలు చేయాలని మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన సిబ్బందితో మాట్లాడారు. మార్చిలోగా పన్నులు వసూళ్లు చేసి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎన్టీఆర్, శ్మశాన వాటిక, కాలేజ్ సర్కిల్ ప్రాంతాలలో ఉన్న ఖాళీస్థలాలను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో ఎవరూ చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్సన్ ఉన్నారు.

ఏపీ ఈ-గవర్నెన్స్ ప్రపంచానికే ఆదర్శం

పుట్టపర్తిరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలు చేసిన వాట్సప్ ఈ-గవర్నెన్స్ విధానం ప్రపంచానికే ఆదర్శమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేశ్ వినూత్న ఆలోచనలతో సుపరిపాలన సాగుతోందన్నారు. రాష్ట్రంలో వాట్సప్ ఈ-గవర్నెన్స్‌తో ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయన్నారు. ప్రభుత్వం 9552300009 అనే వాట్సప్ నెంబర్ ద్వారా ఈ సేవలు అందిస్తోందని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మోహన్‌గాంధీ



కదిరిఅర్బన్, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినట్లు పట్టణానికి చెందిన చిలమత్తూరు మోహన్ గాంధీ పేర్కొన్నారు. గురువారం హిందూపురంలో జరిగిన ఓ సమావేశంలో తనను నియమించినట్లు తెలిపారు.

రైతులూ... మోసపోకండి

పుట్టపర్తిరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తాము డీలర్లమని, ప్రభుత్వం నుంచి సబ్సిడీతో పొందే డ్రిప్పు, స్ప్రింక్లర్లను రెండు, మూడు రోజుల్లో అందజేస్తామంటూ కొందరు డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, అలాంటి మోసగాళ్లను రైతులు నమ్మరాదని ఏపీఎంఐపీ ఎంఐఏఓ చెన్నకేశవులు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. సబ్సిడీతో పొందే డ్రిప్పు, స్ప్రింక్లర్ల కోసం ఏపీఎంఐపీ ద్వారానే రైతులు కేవలం లింకు ద్వారా ఫోన్‌పే, గూగుల్‌పే, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్, నెట్ బ్యాంకింగ్ ద్వారానే డీడీలు కట్టుకోవాలని, ఎవరూ నగదు చెల్లించరాదన్నారు.

ఊట నీటిని అరికట్టండి

బుక్కపట్నం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బిఎస్ఎన్ కాలనీ, బీసీ కాలనీలో ఊటనీరు ప్రజలకు ఇబ్బంది పెడుతోందని, దాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు దేశెట్టి సంజీవరాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఇరిగేషన్ ఏఈకి జమునాబాయికి వినతిపత్రం అందచేశారు. బుక్కపట్నం చెరువు నిండుగా నీరుందని, రైతులు చెరువు కింద పంటలు సాగుచేయడానికి కాలువల ద్వారా నీరు వదలడంతో పై కాలనీల్లో ఊట నీరు అధికంగా వస్తోందని అన్నారు. వీధులన్ని ఊట నీరులో పాచి పట్టాయని, ఇళ్లల్లోకూడా నీరు ఊరు తుండడంతో నడవలేని పరిస్థితి నెలకుందని ఆవేదన చెందారు. స్పందించి ఊటనీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నక్రిష్ణ ఉన్నాడు.

ఇంటర్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి: డీఆర్‌ఓ

పుట్టపర్తిటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) విజయసారథి పేర్కొన్నారు. గురువారం కలెక్టర్‌లోని మినీ సమావేశ భవనంలో పలు శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నిశాఖలఅధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గైర్హాజర్ అయిన విద్యార్థులను నాట్ క్వాలిఫైడ్‌గా ప్రకటిస్తామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఈఓ క్రిష్టప్ప, పరీక్ష నిర్వాహణ ప్రత్యేకాధికారి చెన్నకేశవ ప్రసాద్, ఆర్టీసీ డీఎం ఇనయతుల్లా, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాదా, పోస్టు మాస్టార్ బైపరెడ్డి, విద్యుత్ డీఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ధర్మవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని ఆర్డీఓ మహేశ్ గురువారం తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులతో భోజన సదుపాయాలపై ఆరా తీశారు. వసతి గృహంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

పేట్రేగిపోతున్న చోరులు

◆ ఒకేరోజు పలు ప్రాంతాల్లో..

◆ ఓడీసీలో మూడు, కొత్తచెరువులో రెండు, ధర్మవరంలో ఒక దుకాణంలో చోరీ



కొత్తచెరువు : చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ ఇందిర

ఓబుళదేవరచెరువు /కొత్తచెరువు/ధర్మవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఒకే రోజు పలు ప్రాంతాల్లో దొంగలు తెగబడ్డారు. ఓబుళదేవరచెరువు, కొత్తచెరువు, ధర్మవరంలోని పలు దుకాణాల్లో చోరీలకు పాల్పడ్డారు. ఓబుళదేవరచెరువు మండలంలోని చైన్‌స్నాచర్స్ మంగళసూత్రం చైన్ చోరీ చేసిన సంఘటన మరవకముందే. బుధవారం రాత్రి మండలకేంద్రంలో మూడు దుకాణాల్లో చోరీలు జరిగాయని ఎస్‌ఐ బి. మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు కదిరి-హిందూపురం ప్రధాన రహదారి పక్కనున్న బాబావలీ దుకాణానికి ఉన్న షటర్‌ను తొలగించి, దుకాణంలోకి ప్రవేశించి రూ.30 వేలు నగదు దోచుకెళ్లారు. దుకాణంలో ఏర్పాటు చేసిన సీసీ కేమేరాలో దొంగను గుర్తించామన్నారు. ఇదే రహదారిలో ఉన్న నాకూల్‌సింగ్ దుకాణం షటర్ పగలకొట్టి దొంగలు లోపలికి ప్రవేశించగానే అప్రమత్తమైన దుకాణం యజమాని గట్టిగా కేకలు వేయడంలో దొంగలు పరారైయ్యారు. అలాగే షఫీ మెడిల్ దుకాణంలో షట్ తాళాలు పగలకొట్టి లోనికెళ్లి రూ.రెండువేల నగదుతోపాటు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నొప్పులకు వాడే మందు బాటల్స్ చోరీ చేసినట్లు బాధితుడు రఫీ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● కొత్తచెరువులో రెండు దుకాణాల్లో ..

కొత్తచెరువులో స్థానిక బుక్కపట్నం రహదారి పక్కన సాయినాథ్, మాబులకు చెందిన కిరాణా దుకాణాలను బుధవారం రాత్రి గుర్తుతెలియని దొంగలుషట్టర్‌లను ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు....మాబు కిరాణ దుకాణంలో షట్టర్‌ను ఇనుప రాడ్లతో మెండి దుకాణంలోఉన్న సిగరెట్ బండ్లను, రూ.20వేలు నగదును ఎత్తుకెళ్లారన్నారు. అదేవిధంగా సాయినాథ్ దుకాణానికి ఉన్న షట్టర్‌ను పగలకొట్టి లోపలికి చొరబడి రూ.1-50లక్ష డబ్బులను ఎత్తుకెళ్లినట్టు వారు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, కొత్తచెరువు సీఐ ఇందిరా క్లూజ్‌టీంలతో పరిశీలించి వేలి ముద్రలను సేకరించారు. ఈ చోరీలు జరగడానికి పోలీసుల గస్తీ లేకపోవడమే దీనికి కారణమనిప్రజలు చర్చించుకుంటున్నారు. ఎక్కడా చూసిన బహిరంగంగా మద్యంసేవిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోవడమే ఈ చోరీలకు కారణమవుతున్నారని ప్రజలు అంటున్నారు.

● ధర్మవరంలో..

ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డికాలనీలో ఓ ఇంటిలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కాలనికిచెందిన కుళ్లాయమ్మ గుజిరిలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. అయితే బుధవారంరాత్రి ఇంటిలో ఎవరు ఇంటిలో లేనిసమయంలో గుర్తుతెలియని దొంగలు ఇంటితాళాలు పగలకొట్టి లోపలికి చొరబడి మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లినట్టు వారు తెలిపారు. దీంతో ఉదయం గమనించిన కుళ్లాయమ్మ ఇంట్లో చోరీ చేసినట్లు భావించి, టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.





కొత్తచెరువు, ఓడీసీలో సీసీ కెమెరాలో నమోదైన చోరీ దృశ్యాలు

అధికారులు విభేదాలు వీడాలి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గాండ్లపెంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గత కొద్దిరోజులు అధికారుల మధ్య అంతర్గత విభేదాలు తారాస్థాయికి చేరాయి. గురువారం ఈ విషయాన్ని టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య తహసీల్దార్ వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎండీపీఓ కార్యాలయంలో అధికారుల మధ్య సమన్వయ లోపం ఉందని, ఆ కార్యాలయంలో అధికారులు రెండు వర్గాలుగా ఉన్నట్లు చెప్పారు. వీరి మధ్య విభేదాలు వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని వాపోయారు.

● తాగునీటి సమస్య పరిష్కరించండి

మండలంలోని కురమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీఓ వెంకటరామిరెడ్డిని టీడీపీ నాయకులు గురువారం కోరారు. రెక్కమాను సమీపంలోని వెలిచెలమల ప్రధాన రహదారి కల్వర్టు పనులు చేపట్టడంతో తాగునీటి పైపులైన్ తొలగించారన్నారు. అయితే కల్వర్టు నిర్మాణం పూర్తి అయినా తాగునీటి పైపులను తిరిగి ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి భవాణీ, సర్పంచ్ సుధాకర్‌కు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. ఎంపీడీఓ స్పందించి.. వెంటనే పైపులైన్ అమర్చాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కిరణ్‌కుమార్ రెడ్డికి సూచించారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించాలి

నల్లచెరువు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విజ్ఞాపన పత్రాలు పంపారు. ఈ మేరకు రాష్ట్రపతికి రాసిన లేఖలతో మండలంలోని చిన్నయల్లంపల్లి వద్ద వారు గురువారం నిరసన చేపట్టారు. దేశవ్యాప్తంగా ఉద్యమంలో భాగంగా ఈ లేఖలు పంపుతున్నట్లు చెప్పారు.



రాష్ట్రపతికి పంపుతున్న లేఖలతో అంగన్‌వాడీలు

నేడు చీఫ్ విప్ రాక

పుట్టపర్తిరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రభుత్వం చీఫ్ విప్ బీవీ ఆంజనేయులు ఒక రోజు పర్యటన నిమిత్తం జిల్లాకు శుక్రవారం వస్తున్నారు. శుక్రవారం ఉదయం 8గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి బెంగుళూరు కెంపేగౌడ విమానాశ్రయం చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి రోడ్డుమార్గానా పెనుకొండ చేరుకుని అక్కడి కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం 4.30 గంటలకు రోడ్డుమార్గాన బెంగుళూరు విమానాశ్రయం చేరుకుని.. విమానంలో హైదరాబాదుకు వెళ్తారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

తహసీల్దార్‌కు సన్మానం

గాండ్లపెంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవా అవార్డు తీసుకున్న స్థానిక తహసీల్దార్ బాబురావును టీడీపీ నాయకులు గురువారం సన్మానించారు. ఆయనకు గణతంత్రదినోత్సవం రోజున కలెక్టర్ చేతన్ ఉత్తమ సేవా అవార్డు ఇచ్చారు. దీంతో ఆయన్ను మండల కన్వీనర్ కొండయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గొడ్డివెలగల ప్రసాద్, చంద్ర, ఆనంద్, అక్రమ్, లోకేష్, బాబా, అంజినాయక్, నరసింహులు పాల్గొన్నారు.

వామ్మో పొగమంచు

ఓబుళదేవరచెరువు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో పాటు పొగమంచు ఎక్కువగా ఉండటంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. గురువారం ఉదయం 9గంటలైనా పొగమంచు వీడకపోవడంతో వాహనదారులు లైట్లువేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. అలాగే ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు చలికి ఇబ్బందులు పడ్డారు. చలిమంటలు వేసుకొని.. ఉపశమనం పొందారు.



ఓడీసీలో కమ్ముకున్న పొగమంచు

అలరించిన ధర్మవరం కళాకారుల నాట్యప్రదర్శన

ధర్మవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 28,29 తేదీల్లో ధర్మపతంలోని బ్రాహ్మరి వేదికపై నిర్వహించిన నాట్యప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ధర్మవరానికి చెందిన శ్రీలలిత నాట్య కళానికేతన్ నాట్యగురువులు బాబూబాలాజీ, కమలాబాలాజీ శిష్యబృందం శివనామనృత్యం, దేవి నాట్యం ప్రదర్శించారు. అదేవిధంగా రామలాలిత్య, హర్షశ్రీలు చేసిన జంట నాట్యంతో ప్రేక్షకులను తన్మయం చేశారు. దీంతో ధర్మవరం నాట్యకళాకారులకు ఆలయ వీఆర్‌ఓ శివారెడ్డి సర్టిఫికెట్స్, జ్ఞాపికలను అందజేశారు.



నాట్యప్రదర్శనలో ప్రతిభ కనబరచిన ధర్మవరం కళాకారులు

క్రైం న్యూస్ ..

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



అపస్మారక స్థితిలో ఉన్న వెంకటనారాయణ

గాండ్లపెంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సామరాజుకుంట గ్రామానికి చెందిన వెంకట నారాయణ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటనారాయణ పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు గుర్తించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంకటనారాయణను 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం



చిన్నబాబు

ధర్మవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతి నగర్‌కు చెందిన చిన్నబాబు అదృశ్యమైనట్టు తండ్రి దస్తగిరి టూటౌన్ పోలీసులకు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నబాబు మగ్గం నేస్తూ కుటుంబానికి చేదోడవాదోడుగా ఉండేవాడు. బుధ వారం ఇంటి నుంచి వెళ్లిన అతను రాత్రి అయిన ఇంటికి రాలేదు. గాలించినా ఫలితం లేకపోవడంతో దస్తగిరి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

బుక్కపట్నం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరాల పంచాయతీ రామసాగరం గ్రామంలో రైతు రవికి చెందిన ఓ పాడి ఆవు విద్యుదాఘాతంతో గురువారం మరణించింది. పొల్లాలో చేతి కందే ఎత్తులో విద్యుత్ వైర్లు ఉన్నాయి. మేతకు వెళ్లిన ఆవుకు ఆ విద్యుత్ వైర్లు తగలడంతో అది అక్కడిక్కడే మరణించింది. తన కుటుంబం రెండు పాడి ఆవులతో ఉపాధి పొందుతోందని, ఒక పాడి ఆవు మరణించడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రవి వాపోయాడు. తనకు రూ.70వేలు నష్టం జరిగిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఎద్దు..



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ గోపి

తనకల్లు, జనవరి 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పరాకు వాండ్లపల్లి సమీపంలో గంగమ్మ ఆలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఎద్దు మరణించింది. తనకల్లుకు చెందిన వెంకటరమణ అలియాస్ బైదీ ఎద్దుల బండి లో తన పొలానికి బయలు దేరాడు. మార్గమధ్యలో పరాకు వాండ్లపల్లి వద్ద గల గంగమ్మ ఆలయం దగ్గర మదనపల్లి నుంచి కదిరి వైపు వెళ్తున్న బోలేరా వాహనం ఆ ఎద్దుల బండిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ ఎద్దు అక్కడిక్కడే మరణించగా.. మరో ఎద్దు గాయపడింది. అలాగే రైతు వెంకటరమణకు కూడా గాయాలు అయ్యాయి. రైతును తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎద్దు, బండి విలువ రూ. మూడు లక్షలు అని వెంకటరమణ వాపోయాడు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ గోపి తెలిపారు.

కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి చేరిక

ధర్మవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగో వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దలింగమయ్య, చిన్నలింగమయ్య, వారి అనుచరులు బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ ఆధ్వర్యంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు అంబటి సదీశ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పట్టవా?

కమిషనర్‌ను నిలదీసిన కౌన్సిలర్లు

కదిరిఅర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పన్నుల వసూలపై ఉన్న శ్రద్ధ .. ప్రజాసమస్యలు పట్టవా అని కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌ను నిలదీశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ నజీమున్నీషా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మూడు నెలలైనా సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించడకపోవడంపై కౌన్సిలర్లు మండిపడ్డారు. ఆదాయ మార్గాలపై చూపుతున్న శ్రద్ధ ప్రజా సమస్యలపై చూపడం లేదన్నారు. కేవలం బిల్లుల ఆమోదం కోసం కౌన్సిల్ సమావేశం నిర్వహించడం ఏమిటని మండిపడ్డారు. అనంతరం కౌన్సిల్ బడ్జెట్‌పై కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. టీడీపీ కౌన్సిలర్ అల్హాముస్తఫా మట్లాడుతూ.. తమ వార్డులో ఎలాంటి అభివృద్ధీ జరగలేదన్నారు. అభివృద్ధి కోసం బడ్జెట్ ప్రవేశపెట్టలని పట్టుపట్టారు. మూడునెలలైనా అధికారులు సమా వేశం ఏర్పాటు చేయకపోవడాన్ని వైసీపీ కౌన్సిలర్లు వ్యతిరేకించారు. బడ్జెట్‌ను ప్రవేశానికి ఆమోదించబోమని చెప్పారు. దీంతో బడ్జెట్ ఆమోదాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. అనంతరం అజెండాలోని అంశాలను ఆమోదించారు. సమావేశంలో వైస్ చైర్మన్ గంగాదేవి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు



దీక్షను విరమింపజేస్తున్న నాయకులు

'ఎన్టీఆర్‌కు భారతరత్న' దీక్ష విరమణ

ధర్మవరంరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్టీ రామా రావుకు భారతరత్న ఇవ్వాలని డిమాండ్‌తో పట్టణానికి చెందిన పట్టుచీరల పాలిష్ కార్మికుడు బీఎల్ నరసింహులు 41 రోజులుగా చేస్తున్న సంకల్ప మండల దీక్షను గురువారం విరమించారు. జడ్పీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు చిగిచెర్ల ఓబిరెడ్డి, టీడీపీ నాయకులు నరసింహులు దీక్షకు సంఘీభావం తెలిపి.. కొబ్బరినీళ్లు, నిమ్మరసం తాపించి దీక్షను విరమింపజేశారు. అనంతరం నరసింహులను పలువురు పూలమాలలతో సత్కారించారు. దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మేకల రామాంజినేయులు, ధర్మవరం చెరువు సాగు నీటి సంఘం చైర్మన్ రేనాటి శ్రీనివాసులు, బట్టా అశ్వర్థనాయుడు, తుమ్మల నరసింహరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిప్పేపల్లి వెంకటరాముడు, నరసింహులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సబ్సిడీ డ్రిప్పు కోసం దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ డ్రిప్పుకోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎంఐపి డివిజన్ అధికారి నరసింహప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మధ్య కాలంలో నకిలీ కంపెనీలపేర్లు చెప్పి డీలర్లు, నకిలీ ఉద్యోగస్తులు కొన్ని మండలాల్లో రైతుల నుంచి నగదు తీసుకొన్నారన్నారు. రైతులు తప్పని సరిగా పేమెంట్ డీడీ రూపంలో చెల్లించాలన్నారు. దరఖాస్తులతోపాటు డీడీలు జతపరచి సంబంధిత కార్యాలయాల్లో ఇవ్వాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు



ఆలూడి చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

అగళి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అగళి మండలం కర్నాటక సరిహద్దులో ఉన్న సువర్ణముఖి నది నుంచి సుక అక్రమంగా తరలించకుండా రెవెన్యూ అధికారులు, పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. అగళి మండలంలోని ఆలూడి, నందరాజనపల్లి చెక్‌పోస్టులను గురువారం పరిశీలించారు. కర్ణాటకలోని శిరకు, మధుగిరి ప్రాంతాలకు ఇసుక తరలిపోకుండా ముందస్తు జాగ్రత్తగా ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులను ఆయన పరిశీలించారు. అనంతరం ఇరిగేపల్లి పంచాయతీ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, వీఆర్‌ఓ నరసింహమూర్తి, వరలక్ష్మీ, తదితరులు ఉన్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తే ఆటంకాలు రావు

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పించను పంపిణీ కార్యక్రమాన్ని 1వతేదీ ఉదయం నుండి సాయంత్రం లోపు వందశాతం పూర్తి చేయాలని, చిత్త శుద్ధితో పనిచేస్తే ఎలాంటి ఆటంకాలు రావని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ అన్నారు. ఈసందర్భంగా మండల కార్యాలయంలో గురువారం సచివాలయ సిబ్బంది సమావేశం నిర్వహించారు. మండలంలోని గురుకుల పాఠశాల, కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు.

కుష్ఠువ్యాధి పై అవగాహన ర్యాలీ

మడకశిర రూరల్, జనవరి 30:(ఆంధ్రజ్యోతి) మండలంలోని కదిరేపల్లి, గుండుమల, కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో గురువారం కుష్ఠువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిలచారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి ర్యాలీ పాల్గొన్నారు. మొదట గాంధీజీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంజువాణి మట్లాడుతూ చర్మవ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నరేష్,శ్రీనివాసునాయక్,శృతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో బాలరాముని విగ్రహప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 22న వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. స్థానిక సిద్ధార్థ పాఠశాలలో గురువారం భారతీయ సంస్కృతి ప్రతిష్టాన్ సౌజన్యంతో విశ్వహిందూపరిషత్ జిల్లా ప్రఖండ్ అధ్యక్షులు వేదవ్యాస్, ఉపాధ్యక్షులు ప్రకాశ్‌రావులు సమావేశం నిర్వహించి విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సాయిప్రసాద్, బజరంగ్ దళ్ సభ్యులు కళ్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

ఫీజు వేధింపులు ఆపకపోతే ఆందోళన

హిందూపురం అర్బన్, జనవరి 30,(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఫీజుల వేధింపులు ఆపకపోతే ఆందోళన చేపడతామని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఇటీవల అనంతపురం సోమలదొడ్డి వద్ద నారాయణ కళాశాలలో హాస్టల్ విద్యార్థి ఫీజుల వేధింపులు భరించలేక మూడంతస్తుల మేడపై నుంచి దూకి కిందపడి మృతి చెందిన విషయం తెలిసిందే మృతిపట్ల సమగ్ర విచారణ చేపట్టి నారాయణ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు అందుకున్న శిక్షణ పొందిన మహిళలు

మడకశిరటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థలో టైలరింగ్‌లో శిక్షణ పొందిన 60 మంది నిరుద్యోగ మహిళలకు గురువారం స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరికృష్ణ చేతులమీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి ఉపాధికి ఎంతో ఉపయోగపడుతుందని, యువత లక్ష్య సాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పనిచేస్తే ఎంతటి కష్టతరమైన పనిలో అయినా విజయం పొందవచ్చన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా అధికారి తనిఖీ

గోరంట్ల, జనవరి30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం పిహెచ్‌సీ, గోరంట్ల కోలోకేటెడ్ పిహెచ్‌సిలను రాయలసీమ జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మానాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, ల్యాబ్‌ను, పరికరాలు, రక్తపూత పరీక్షల స్లైడ్లు, హాజరు పట్టికలను పరిశీలించారు. ఆసుపత్రి వైద్యసిబ్బంది, వారి పనితీరు గురించి మెడికల్ అధికారి డా.మాధవి, డా. వాసుతో చర్చించారు.

పట్టణ సమస్యలు పరిష్కరించండి

పెనుకొండ టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పెనుకొండ పట్టణంలో 20వార్డుల్లో పలు సమస్యలున్నాయని వాటిని పరిష్కరించాలని కన్వీనర్ శ్రీరాములు కోరారు. బుధవారం కమిషనర్ సతీష్‌కుమార్‌ను కలిసి సమస్యలు విన్నవించారు. వీధిలైట్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పంటలు అమ్మాలంటే పక్క రాష్ట్రానికే!

- రైతులకు ఉపయోగపడని మార్కెట్ యార్డు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం



దిష్టిబొమ్మలా మారిన మడకశిర మార్కెట్ యార్డు

మడకశిర రూరల్, జనవరి 30:(ఆంధ్రజ్యోతి): అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తయారైంది మడకశిరలోని మార్కెట్ యార్డు పరిస్థితి. నియోజకవర్గంలోని రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి పట్టణ సమీపంలో ఐదు ఎకరాల్లో మార్కెట్ యార్డును నిర్మించారు. అందులో షెడ్లు, ప్లాట్‌ఫారాలు అన్నీ నిర్మించారు. అయినా రైతులకు అది ఏ మాత్రం ఉపయోగపడడంలేదు. మార్కెట్ యార్డుకు పాలకమండలి సభ్యులను నియమిస్తున్నారు. వారు వస్తున్నారు, పోతున్నారేగాని అభివృద్ధి గురించి ఏ మాత్రం పట్టించుకోవడంలేది రైతులు వాపోతున్నారు. వైసీపీ పాలనలో యార్డు అభివృద్ధికి ఆర్భాటం చేశారేగాని అభివృద్ధి చేయలేకపోయారు. దీంతో తాము కష్టపడి పండించిన పంటలను స్థానికంగా అమ్ముకోవడానికి మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు కర్ణాటక మార్కెట్ యార్డులకు వాటిని తరలించుకుపోతున్నారు. దీంతో వారికి ఇబ్బందులు తప్పడంలేదు.

మడకశిర ప్రాంతంలో ఎక్కువగా చింతపండు, మిరప, రాగి వరి,మొక్కజొన్న, వక్క, ఆకు, మల్బరీ పంటలు పండిస్తున్నారు. ఒక్క చింతపండు మాత్రం హిందూపురం మార్కెట్ యార్డుకు వెళుతుంది. మిగిలిన పంటలు అన్నీ కర్ణాటకలోని తుంకూర్, యరియూర్, చిత్రదుర్గం, పావగడ, రాంపురం, చింతామణి తదితర పట్టణాల్లోని యార్డులకు తీసుకువెళుతున్నారు. వ్యయప్రయాసలతో రైతులు పంటలను అక్కడకి తీసుకువెళ్ళి అమ్ముకుంటున్నారు. అక్కడ గిట్టుబాటు ధరలు లేకపోతే అక్కడే అయినకాడికి అమ్ముకుని వస్తున్నారు. ఇదేమని ప్రశ్నించే పరిస్థితి లేదు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని స్థానికి మార్కెట్ యార్డును అభివృద్ధిచేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దీనిపై మడకశిర యార్డు కార్యదర్శి నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా, మార్కెట్ యార్డుపై రైతులనుంచి వచ్చిన విన్నపాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుతున్నామన్నారు.



యార్డులో నిరుపయోగంగా ఉన్న షెడ్లు

పంటను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడానికి ఇబ్బంది



రైతులు పంటను వాహనాల ద్వారా దూరప్రాంతాలకు తీసుకెళ్ళాడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పండించే పంటలను కొనుగోలు చేయడానికి స్థానికంగానే మార్కెట్ సౌకర్యం కల్పించాలి. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకొని స్థానిక మార్కెట్ యార్డును తిరిగి ప్రారంభించాలని కోరుతున్నా.

నారాయణప,
రైతు, కల్లుమర్రి

యార్డులోనే పంటలు కొనుగోలు చేయాలి



స్థానిక మార్కెట్ యార్డులోనే రైతులు పండించిన పంటలు కొనుగోలు చేయడానిక వ్యాపారస్థులను ప్రోత్సహించాలి, యార్డులో అన్నీ సౌకర్యాలు ఉన్నా వ్యాపారస్థులు ముందుకు రాకపోవడంతో స్థానిక యార్డు నిరుపయోగంగా ఉంది. విధిలేని పరిస్థిలో కర్ణాటకకు తీసుకెళ్ళి అమ్మకొంటున్నాం.

చౌడప్ప,
రైతు, మణూరు

మాటలే తప్ప.. చేతలేవీ?

- నగర పంచాయతీ సమావేశంలో సభ్యుల ధ్వజం

మడకశిరటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాల్లో సభ దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడమేగాని ఏ సమస్యనైనా పరిష్కరించారా? అంటూ సభ్యులు నగర పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. మడకశిర నగర పంచాయతీ సమావేశ భవనంలో గురువారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ, గత సమావేశాల్లో ఆయన దృష్టికి అనేక సమస్యలు తెచ్చామని, అయినా వాటిని ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. 9వవార్డు కౌన్సిలర్ ఉమాశంకర్ మాట్లాడుతూ, వాల్మీకి సర్కిల్‌లో సులబ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని కోరానని, అయినా ఇంతవరకూ అది కార్యరూపం దాల్చలేదన్నారు. తాగునీటి సమస్య అధికంగా ఉందని, దీనిని ఎమ్మెల్యే సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకొన్నా తాగునీటి సమస్యను పరిష్కరించడంలో అలసత్వం చూపుతున్నారని ఆరోపించారు. 15వవార్డు కౌన్సిలర్ నరసింహరాజు మాట్లాడుతూ సంఘాల్లో గోల్‌మాల్ జరుగుతోందని, సమావేశం జరిగినప్పుడు తమ కెందుకు సమాచారం ఇవ్వడంలేదని ప్రశ్నించారు. గతంలో సైతం పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో కమిషనర్ రంగస్వామి, చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, అధికారులు, సభ్యులుపాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్, సభ్యులు

మహాత్మా గాంధీకి ఘన నివాళి

హిందూపురం, మడకశిర నియోజకవర్గాల పరిధిలో పలుచోట్ల గురువారం మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పెనుకొండ, జనవరి30(ఆంధ్రజ్యోతి):మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం పెనుకొండలో నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణమండపం నుంచి గాంధీ సర్కిల్ వరకు ఊరేగింపుగా వెళ్లి గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు సుధాకర్‌గుప్త, సూర్యనారాయణ, కేదరినాథ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవుల త్యాగాలు మరువలేనివి..

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి అసువులు బాసిన అమరజీవుల త్యాగాలు మరువలేనివని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయప్ప పేర్కొన్నారు. గురువారం స్థానిక పరిటాల శ్రీరాములు డిగ్రీకళాశాలలో చరిత్ర విభాగం అధిపతి ప్రతాప్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు.



పెనుకొండలో గాంధీకి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు



గోరంట్లలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆవోపా నేతలు

సోమందేపల్లి: గాంధీజి వర్ధంతిని పురస్కరంచుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుష్ఠువ్యాధి నివారణపై పట్టణంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, రవీంద్ర, శారద పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో మహాత్మాగాంధీ 77వ వర్ధంతి వేడుకలను ఆర్యవైశ్యసంఘం అనుబంధ సంస్థ ఆవోపా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆవోపా అధ్యక్షులుతు షబ్బరీష్, సుకుమార్‌గుప్త, బైసాని రాజేష్, రవితేజ, రమేష్, ఫణీంద్ర పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన సదస్సు

అగళి: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని అగళి, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని గ్రామాలలో డా.శివానంద ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.శివానంద, గాయిత్రి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, నరసారెడ్డి పాల్గొన్నారు.

అపర భగీరథుడు చంద్రబాబు: మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రైతుల పాలిట ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అపర భగీరథుడని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. రొద్దం మండలం బొక్సంపల్లి సబ్‌స్టేషన్ వద్ద హంద్రీనీవా కాలువ వెడల్పు, మరమ్మతు పనులను మంత్రి సవిత గురువారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. 54వ ప్యాకేజీకి సమీపంలో కాలువ వెడల్పు పనులు చేపడుతున్నామన్నారు. కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లాకు సాగు, తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో గొల్లపల్లి రిజర్వాయర్‌ను గత టీడీపీ హయాంలో చంద్రబాబు నిర్మించారన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలకులు.. రైతులను ఆదుకుంటామని నమ్మబలికి.. నట్టేట ముంచారన్నారు. కాలువ వెడల్పు చేస్తామని చెప్పి.. కనీసం మరమ్మతులు చేయలేదని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి రాగానే ప్రతిచెరువుకు నీరందించాలన్న లక్ష్యంతో చర్యలు చేపడుతున్నామన్నారు. కాలువ పరిధిలోని ప్రతి చెరువుకు నీరందిస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, డీఈ రామసుబ్బయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి సవిత



వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

పోషక విలువలతో కూడిన ఆహారంతోనే ఆరోగ్యం

హిందూపురం అర్బన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు కేశవులు పేర్కొన్నాడు. నారాయణ పాఠశాలలో ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్ ఆధ్వర్యంలో స్వాస్థ్య కార్యక్రమాన్ని చేపట్టారు.

మహిళ జుత్తు కత్తిరించిన కేసులో మరికొందరి అరెస్టు..?

పెనుకొండ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిమడుగుకు చెందిన వెంకటలక్ష్మి అనే మహిళకు జుత్తు కత్తిరించిన కేసులో మరికొందరిని పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. ఆమె ఓప్రేమ జంటకు సహకరించిందని ఈనెల 14న బాధిత కుటుంబ సభ్యులు విచక్షణా రహితంగా ఆమెపై దాడిచేసి, జుత్తు కత్తిరించారు. దీనిపై ఆగ్రహించిన బాధితురాలు 20 మందిపై ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ఇప్పటికే 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అయినా తనకు న్యాయం చేకూరలేదన్న మనస్తాపంతో వెంకటలక్ష్మి ఈనెల 29న ఆత్మహత్యకు యత్నించిన విషయం విదితమే. దీంతో పోలీసులు మిగిలిన వారిలో కొంతమందిని అరెస్టు చేసినట్లు సమాచారం.

షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ భూముల సర్వే



ఆక్రమించుకున్న కుంటను చూపుతున్న వెంకటరెడ్డిపల్లి రైతులు

పెనుకొండ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ వారు ఆక్రమించినట్లు ఆరోపణలు వచ్చిన భూములకు రెవెన్యూ అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. పొలాల్లోకి వెళ్లే దారిలేకుండా ట్రస్ట్ వారు చుట్టూ ఫెన్సింగ్ వేశారని వెంకటరెడ్డిపల్లి రైతులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, సర్వేయర్లు రాంపురం పంచాయతీలోని వాసుదేవపురంకు చెందిన భూముల సర్వే చేపట్టారు. ట్రస్ట్‌వారు కొన్న భూములే కాకుండా రాళ్లగుట్ట, కుంటలు ఆక్రమించుకుని చుట్టూ ఫెన్సింగ్ వేశారని సర్వేలో తేలిందని అధికారులు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న ఆటో డ్రైవర్ సంజీవ కుటుంబానికి వైద్య ఖర్చులకోసం బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆర్థిక సాయంను గురువారం అందజేశారు. పెనుకొండ నగర పంచాయతీ కోనాపురంలో ఆటో డ్రైవర్ సంజీవ కుమారుడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా విషయం తెలుసుకున్న మంత్రి తక్షణ సాయం కింద రూ.10వేలు అందించారు.

నేడు చీఫ్ విప్ రాక

పుట్టపర్తిరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రభుత్వం చీఫ్ విప్ బీవీ అంజనేయులు ఒకరోజు పర్యటన నిమిత్తం జిల్లాకు శుక్రవారం వస్తున్నారు. శుక్రవారం ఉదయం 8గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి బెంగుళూరు కెంపేగౌడ విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డుమార్గాన పెనుకొండ చేరుకుని అక్కడి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు రోడ్డుమార్గాన బెంగుళూరు విమానాశ్రయం చేరుకుని.. విమానంలో హైదరాబాదుకు తిరిగి వెళ్తారు.

క్రైం కార్నర్

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి



తాడెప్ప(ఫైల్)

గుడిబండ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ఎస్‌గుండ్లు గ్రామానికి చెందిన తాడెప్ప(64) అనే వ్యక్తి మిద్దెపై నుండి కాలుజారి కిందకుపడి మృతి చెందినట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప తెలిపారు. తాడెప్ప ఇంటి మిద్దెపైన కందులు, ఉలవలు ఎండకు ఆరబెట్టారు. వాటిని తీసుకొచ్చేందుకు మిద్దెపైకి ఎక్కి కిందకు దిగుతున్న సమయంలో ఆయన నిచ్చెన పలక విరిగి నేలపై పడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి ఆయన అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్యతోపాటు ఒక కుమారుడు ఉన్నారు. కుమార్తెకు వివాహం అయింది. పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ఆస్పత్రిలో శవ పరీక్షలు నిర్వహించారు. మిద్దెపైనుండి కిందకు పడి మృతి చెందిన తాడెప్ప కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బాలిక అదృశ్యం

గోరంట్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యమైనట్లు బాలిక తాత గోరంట్ల పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. చిన్నతనంలోనే బాలిక తల్లిదండ్రులకు దూరం కావడంతో ఆమె తాత సంరక్షణలో పెరుగుతోంది. గోరంట్ల మండలానికి చెందిన ఓగ్రామంలోని బంధువుల ఇంటికి ఈనెల 5న వెళ్లింది. అలాగే అక్కడనుంచి 8వతేదీన తలుపుల మండలానికి చెందిన మరో గ్రామంలోని బంధువుల ఇంటికి వెళతానని చెప్పి వెళ్లింది. తాత గ్రామానికి తిరిగి రాకపోవడంతో ఆమెకోసం బంధువుల ఇళ్లలో గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రమాత్రలు మింగిన మహిళకు అస్వస్థత

గోరంట్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత జయసుధ అధిక మోతాదులో నిద్ర మాత్రలు మింగి గురువారం అస్వస్థతకు గురైంది. ఆమెకు కొంతకాలంగా మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వైద్యచికిత్సలు అందిస్తున్నారు. ఈనేపథ్యంలో జయసుధకు తలనొప్పి రావడంతో తనకు కేటాయించిన మాత్రలు కాకుండా భర్తకోసం తెచ్చుకున్ననిద్ర మాత్రలు మింగినట్లు బంధువులు తెలిపారు. తలనొప్పి తగ్గకపోవడంతో మాత్రలన్నీ మింగినట్లు వివరించారు. అస్వస్థతకు గురైన ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హిందూపురంకు తరలించారు.

గుజిరీ వ్యర్థాలకు నిప్పు

సోమందేపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లిలో గుజిరీ వ్యర్థాలకు గురువారం ఆకతాయిలు నిప్పంటించారు. పెనుకొండ, హిందూపురం రోడ్డు పక్కన బ్రాహ్మణపల్లి సమీపంలో సాయంత్రం మంటలు ఎగసి పడుతుండటంతో వాహనదారులు గమనించి స్థానికులకు సమాచారం అందించారు. గుజిరీ వ్యాపారి మాజిద్ కియా వ్యర్థాలను తన స్వగ్రామమైన బ్రాహ్మణపల్లిలో డంప్ చేశాడు. ఈ క్రమంలో కొందరు ఆకతాయిలు వ్యర్థాలకు నిప్పంటించారు. గ్రామస్థులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

బస్సు చక్రాల కిందపడి యువతి మృతి



మౌనిక (ఫైల్)

పెనుకొండ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో కదులుతున్న బస్సును ఎక్కబోయి ప్రమాదవశాత్తు బస్సుచక్రాల కిందపడి రొద్దం యువతి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. రొద్దం మండలం గౌరాజుపల్లి గ్రామానికి చెందిన కురుబ శ్రీనివాసులు కుమార్తె మౌనిక(26) బొమ్మనహళ్లిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. ఈ క్రమంలో బుధవారం బెంగళూరులోని చిన్నయ్యకూడలివద్ద కదులుతున్న బస్సు ఎక్కబోయి ప్రమాదవశాత్తు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న తల్లి ఉమాదేవి, తండ్రి శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు బోరున విలపించారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించగా గురువారం రొద్దం మండలం గౌరాజుపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష భర్త చరణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.